

కత్తుల బోను
అడపా చిరంజీవి

**KATTULA BONU**
BY
ADAPA CHIRANJEEVI
Cell : 99890 43117

First Edition : August 2018
e-book : www.kinige.com
Price Rs. 60/-

Publishers
**SRI KRISHNADEVARAYA PUBLICATIONS**
Hyderabad.

DTP
**Akhilaja**

Cover Design
**Mummadi Hariprasad**

**Keerthi Design Hub**
Hyderabad-68.
Cell : 99854 51147

# కత్తుల బోను

“మహాప్రభూ... మహాప్రభూ!” అంటూ ఉరుకులు పరుగులు తీస్తూ వచ్చిన ఒక భటుడు మహారాజు కీర్తిసేనులవారి పాదాల మీద పడ్డాడు.

“ఏమిటి? ఏమా కంగారు, ఏం జరిగింది?” అని నింపాదిగా ప్రశ్నించాడు మహారాజు కీర్తిసేనుడు.

మెల్లగా పైకిలేచిన ఆ భటుడు ఆయాసం తీర్చుకుంటూ, “ప్రభూ! మన పట్టపుటేనుగు మరణించింది!” అని చెప్పాడు.

“పట్టపుటేనుగు మరణించిందా? ఏమిటీ అకాలవార్త!” మహారాజు ఆశ్చర్యం ప్రకటించాడు.

కీర్తిసేనుడితో రాచరికపు వ్యవహారాల గురించి సమాలోచన చెయ్యడానికి అప్పుడే వచ్చిన మహామంత్రి గుణవర్మ భృకుటి ముడిపడింది.

“మహారాజా! శుభకార్యాలకు నగరమంతటా ఊరేగింపుగా తిరిగే భద్రగజం అకాల మృత్యువాతపడటం అశుభసూచకం... మీకు తెలియనిది ఏముంది?”

మౌనంగా తల వూపిన కీర్తిసేనుడు విగడియపాటు మాట్లాడలేకపోయాడు.

ఆయన ఆలోచనలను భగ్నం చెయ్యడం ఇష్టం లేక మహామంత్రి కూడ మౌనం వహించి చేసైగ చెయ్యగానే, వార్త తెచ్చిన భటుడు వెనుదిరిగి వెళ్లిపోయాడు.

"మంత్రివర్యా! భద్రగజం మరణం మాలో కలవరం రేపుతున్నది. ఇప్పుడేమిటి చెయ్యడం?"

"కలవరపడకండి ప్రభూ! మనకు, మన రాజ్యానికి ఎటువంటి ప్రమాదం లేదు. దేశం సుభిక్షంగా వున్నది. పోయిన ఏడాది కంటే ఈ యేడు పంటలు బాగా పండాయి. ప్రజలు ఆనందోత్సాహాలతో ఉల్లాసంగా వున్నారు. మీ ధర్మపాలనలో ప్రజలకు లోటు ఏమున్నది ప్రభూ!"

"అయితే, ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటో సెలవియ్యండి మంత్రివర్యా!"

"ఘనంగా పేరు తెచ్చుకున్న మహాజ్యోతిష్య పండితులు మన రాజ్యంలో వున్నారు. మహారాజా! వారిని రావించి, విషయం తెలుసుకుందాము..."

"మంచి యోచన... ఎంతమంది వుంటే అంతమందినీ రావించండి..." అంటూ ధైర్యం తెచ్చుకున్నాడు కీర్తిసేనుడు.

❖ ❖ ❖

మహారాజు ఎదురుగా ఆశీనులై వున్నారు. పదిమంది జ్యోతిష్య పండితులు. తాళపత్ర గ్రంథాలను తెరిచి పట్టుకుని వేళ్లమీద దీక్షగా లెక్కలు వేస్తున్న వారిని శ్రద్ధగా గమనిస్తున్నాడు కీర్తిసేనుడు.

మహారాజుకు ఓ పక్కగా వున్న ఆసనం మీద కూర్చున్న గుణవర్మ, ఏ అశుభం వినవలసి వస్తుందోనని కాస్త ఆందోళనగానే వున్నాడు. చిట్టచివరకు పండితులంతా ముఖముఖాలు చూసుకుని, రాజుగారి ముఖం వైపు సందేహంగా

చూశారు.

"పండిత శ్రేష్టులారా... మీ జోస్యఫలితం ఏమిటో సెలవియ్యండి" అని అడిగాడు కీర్తిసేనుడు.

ఒక పండిత శ్రేష్టుడు తల పంకించి, "మహాప్రభూ! ప్రజారంజకమైన మీ పరిపాలనకు ఎటువంటి ఆటంకమూ లేదు. మీ కీర్తి ఆచంద్రతారార్కము విలసిల్లుతుంది" అని చెప్పాడు.

"అది మా పేరులోనే వున్నది!" అంటూ మీసం మెలేశాడు మహారాజు.

మరో పండితుడు తల తాటించి, "అవును మహారాజా! మీ జాతకం మహారాణీవారి జాతకం దివ్యంగా వున్నవి. చిరకాలం ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారు..." అని సెలవిచ్చాడు.

అలా ఆ పండితులలో ఎనిమిది మంది శుభసూచకములనే చెప్పి, కీర్తిసేనుడికి ఆనందం కలిగించారు.

తొమ్మిదో పండితుడు, "క్షమించండి ప్రభూ! మీ కుటుంబం వైపు శుక్రుడు వక్రదృష్టితో చూస్తున్నాడు. ఇదీ అని చెప్పలేని ప్రమాదమేదో పొంచివున్నది. కొండుభట్టు జోస్యులు దీనికి సమాధానం చెప్పగల సమర్ధులని నా విశ్వాసం..." అంటూ వారికి మధ్యలో ఆశీసులై వున్న పండితుడి వైపు సాభిప్రాయంగా చూశాడా జోస్యుడు. వెనువెంటనే అందరి దృష్టి ఆయన వైపు మళ్లింది.

"అవును రాజా! చక్రతీర్ధులవారు చెప్పింది వాస్తవం. రాజ్యనష్టం, ప్రాణహాని లాంటి సూచనలేవీ లేవు. యువరాణీవారి జాతకాన్ని పరిశీలించగా ఒక విషయం బయట పడింది..." అంటూ ఆగాడు కొండుభట్టు.

"ఏమిటి?"

"మీ వంశ గౌరవానికి భంగం కలిగించే విషమ పరిస్థితి..."

"పండితోత్తమా! సందేహించక, అదేమిటో సెలవియ్యండి..."

"యుక్త వయస్సులో వున్న యువరాణి ఒక సాధారణ నిరుపేద యువకుణ్ణి ప్రేమించి, పెళ్లాడే సూచన బలంగా వున్నది. క్షత్రియుడు కానివాడు, మీ వంశ ప్రతిష్టకు తగనివాడు మీకు అల్లుడుగా వస్తాడు..."

కొండుభట్టు మాటలకు కీర్తిసేనుడి ముఖం మ్లానమయింది. ఏం మాట్లాడటానికి తోచలేదు. ఇంతలో గుణవర్మ కల్పించుకుని, "జాతక చక్రం సరిగ్గా వీక్షించారా?" అన్నాడు.

"సందేహపడకండి మహామంత్రీ! యువరాణీవారి జాతకరీత్యా ప్రేమ విషయం ఒక్కటే కాదు... ప్రమాద ఘంటికలు ధ్వనిస్తున్నాయి. రెండు వత్సరములు కంటికి రెప్పలా అమ్మాయి వారిని కాపాడుకుంటే, గండం గట్టెక్కినట్టే! ఋషీశ్వరులకు గానీ అర్థంకాని కొన్ని విషయాలు జాతకంలో సూచనప్రాయంగా మాత్రమే వుంటాయి. నా జోస్యానికి తిరుగులేదు... హెచ్చరిక!" అంటూ లేచి నిలబడి మహారాజుకు అభివాదం చేశాడు కొండుభట్టు.

మౌనం వహించిన కీర్తిసేనుడి ఆంతర్యం గ్రహించిన గుణవర్మ ఆ జ్యోతిష్య పండితులకు కానుకలిచ్చి పంపించాడు.

❖ ❖ ❖

రాచరికపు వ్యవహారాలు చూడకుండా దిగాలుగా కూర్చున్న కీర్తిసేనుణ్ణి కలిశాడు గుణవర్మ. "ప్రభూ! దిగులుపడుతూ కూర్చుంటే ప్రమాదం తప్పిపోతుందా?"

"ఏం చెయ్యమంటారు మంత్రివర్యా! మాకేమీ తోచకుండా వున్నది. ప్రాణానికి ప్రాణమైన మా కూతురుని ఎలా రక్షించుకోవాలో తెలియడం లేదు.

ఈ విషయం విన్నప్పటి నుంచి మహారాణీవారు చంద్రలేఖని ఒక్క గడియ కూడ విడిచి వుండటం లేదు. దీనికి తరుణోపాయం ఏమిటి చెప్పండి...” అని అడిగాడు మహారాజు.

“తరుణోపాయం వున్నది ప్రభూ! కోట బయట జనసంచారం ఎక్కువగా వున్న ప్రదేశంలో ఒక ఒంటి స్తంభం మేడను నిర్మించాలి. శత్రు దుర్భేద్యమైన భవనంగా దాన్ని రూపొందించాలి. చెలికత్తెలను తోడిచ్చి, యువరాణి చంద్రలేఖను ఆ మేడలో వుంచాలి. బయట విచ్చు కత్తులతో సైనికులు కాపలా కాస్తారు. భటులు పహరా తిరుగుతారు. ఒక చీమ లోపలికి వెళ్లదు. ఒక ఈగ బయటికి రాదు. మీరు, మహారాణీ వారు చూడాలనుకున్నప్పుడు చూడవచ్చు. యువరాణి మాత్రం జోస్యులు చెప్పిన రెండు వత్సరాల కాలం బయటికి వచ్చే వీలు లేదు. ఆ భవనమే ఆమెకు రక్షణ కవచం. ఏ ప్రమాదం సంభవించకుండా పటిష్టమైన కాపలా ఏర్పాటు చేస్తాము... ఏమంటారు మహారాజా?”

రెండు విగడియల పాటు మాట్లాడకుండా వుండిపోయిన కీర్తిసేనుడి ముఖంలోకి కళ వచ్చింది. ఆనందంగా తల పంకించి, “మీ ఆలోచన దివ్యంగా వుంది మహామంత్రీ... ఆలస్యం కాకుండా వెనువెంటనే భవన నిర్మాణానికి ఏర్పాట్లు చేయించండి” అని ఆజ్ఞాపించాడు.

గుణవర్మ వెళ్లడానికి ఉద్యుక్తుడౌతున్న సమయాన చేసైగతో ఆయన్ని ఆపేశాడు కీర్తిసేనుడు. “మంత్రివర్యా! నాదొక సందేహం. మేడను కోటలోపల కాకుండా పురజనులు తిరిగే చోట నిర్మించడం దేనికి?”

“కోట లోపల భవనం వుంటే మీకు, రాణీవారికి మాటిమాటికీ యువరాణిని చూడాలనిపిస్తుంది. అమ్మాయి క్షేమం దృష్ట్యా అది మంచిది కాదు. అదీగాక కోట బయట అయితే యువరాణీకి ప్రజల తోడు కూడ వుంటుంది. మీ పట్ల భక్తి వున్న పురజనులూ వున్నారు, కానుకలకు ఆశ పడేవారూ వున్నారు.

ఏది ఏమైనా, యువరాణి రక్షణ మనందరి కర్తవ్యం...” అంటూ మందిర ద్వారం వైపు నడిచాడు మహామంత్రి.

❖ ❖ ❖

శత్రు దుర్భేద్యమైన భవన నిర్మాణం పూర్తయింది. రాత్రనక, పగలనక కొన్ని వందల మంది శ్రమశక్తిని ధారపోసి కనులకింపు కలిగించే అపూర్వ మందిరాన్ని సాక్షాత్కరింపజేశారు.

ఆ ఒంటి స్తంభం మేడను తలలెత్తి చూసిన వాళ్లంతా ముక్కున వేలేసుకున్నారు.

అపూర్వమైన ఆ భవంతిలో రాజకుమారి తన ఇష్టసఖులైన పది మంది చెలికత్తెలతో స్వచ్ఛందంగా బందీ అయిపోయింది.

“ఇలాంటి విచిత్రం ఎక్కడా వినలేదు. ఎన్నడూ కనలేదు. కోటలో యువరాణికి కోటలోనే రక్షణ లేదట! అందుకే ఇక్కడ కోట కంటే బలమైన సౌధం నిర్మించారు...” ఆ మేడ వైపు ఆశ్చర్యంగా చూస్తున్న ఇద్దరు స్త్రీ మూర్తులతో అన్నాడో వృద్ధుడు. వారి భర్తలు కూడ పక్కనే వున్నారు.

“మాది నగరం ఆవల వున్న శ్రీపురమండి. ఈ వింత భవనం గురించి విని, చూడాలని వచ్చాము. మీరు చెప్పింది అక్షరాలా నిజం పెద్దయ్యా... ఇలాంటి మేడ కట్టాలంటే ఎవరివల్లా అయ్యే పని కాదు. మన మహారాజు తలుచుకోవడం వల్ల సాధ్యమైంది!” అన్నాడు ఒకామె భర్త.

“మారాజు దయాస్వరూపులు. మన రాకుమారికి ఎలాంటి ప్రమాదం సంభవించకూడదు. ఆమె చల్లగా వుండాలి” అంటూ చేతులెత్తి దీవించాడు రెండవ స్త్రీ భర్త. ఆ తరువాత ఆ నలుగురూ తమ దారిన తాము వెళ్లిపోయారు.

ఆ దారిన వెళుతున్న ప్రతివాళ్లూ పని వున్నా లేకపోయినా అక్కడ ఓ

గడియ ఆగడం, ఆ భవన అందాలను తనివితీరా చూడటం ఆ పురజనులకు ఒక అలవాటుగా మారిపోయింది.

ఆ భవంతి చుట్టూ అగడ్త వున్నది. దాని నిండా మొసళ్లు కోరలు సాచుకుని తిరుగుతూ వున్నాయి. అగడ్త ఆవల విచ్చుకత్తులతో సైనిక కాపలా వున్నది. సైనికులను దాటుకుని వెళితే... శిలాసదృశ్యమైన లోహంతో రూపొందించబడిన సింహద్వారం వున్నది. దాన్ని తెరవగలిగే కిటుకు తిమ్మయ్య అనే నమ్మిన బంటు ఒక్కడికే తెలుసు. ఇంకెవరూ దాన్ని తెరవలేరు.

ఆ భవంతి ముందు భాగంలో నల్లరాతి ఫలకం మీద స్వర్ణకాంతిలో గుండ్రని అక్షరాలు రాయబడి వున్నాయి.

## హెచ్చరిక!

'యువరాణి చంద్రలేఖ నివసిస్తున్న ఈ భవంతిలోకి ప్రవేశించాలని ప్రయత్నించేవారు ఎవరైనా సరే శిక్షార్హులు. పట్టుబడితే, తల కోట గుమ్మానికి వేలాడదీయబడుతుంది. మొండెం మొసళ్లకు ఆహారంగా వేయబడుతుంది. ప్రాణాలమీద ఆశ ఉన్నవారికి ఇది హెచ్చరిక!

**–మహారాజు కీర్తిసేనుడు**

**(మరాళ రాజ్యము)**

ఆ దారిన పోతున్న ప్రతి పౌరుడు అక్కడ ఆగడం, రాతిఫలకంపై రాసివున్న ఆ ప్రకటన చదివి, అదిరి బెదిరి పరుగు తీయడం, అలాంటివారిని చూసి పురజనులు నవ్వుకోవడం అక్కడ ఆనవాయితీ అయిపోయింది.

ఆ భవన రక్షకుడు, ప్రధాన కాపలాదారుడు, సింహద్వారం తెరవగలిగినవాడు తిమ్మయ్య ఒక్కడే! అతనంటే రాజుగారికి మహాగురి. కారణం,

తిమ్మయ్య వంశంలో తాతల కాలం నుంచి ఆ రాజవంశాన్ని అంటి పెట్టుకుని సేవ చేస్తున్నారు. వారి త్యాగాలను కీర్తిసేనుడి వంశీకులెవరూ మరచిపోలేరు. ఈ తరం వాడైన తిమ్మయ్య అంటే మహారాజుకు ఎంతో అభిమానం.

అందుకే, ఆ మేడకు ముందుభాగంలో అందమైన చిన్న గృహాన్ని తిమ్మయ్య కోసం కట్టించాడు కీర్తిసేనుడు. రాత్రి సమయాలలో అతను మిద్దె మీద కూర్చుంటే ఎదురుగా వున్న యువరాణి మేడ కనిపిస్తుంది. దివిటీల వెలుగులో ఎటు నుంచి ఎవరు కదిలినా తెలుస్తుంది. అప్రమత్తంగా కాపలా కాయడంలో తిమ్మయ్య సిద్ధహస్తుడు.

దివిటీలను పట్టుకుని ఒంటిస్తంభం మేడ చుట్టూ తిరుగుతున్న భటులను మిద్దె పైనుంచి గమనిస్తున్న తిమ్మయ్య సంతృప్తిగా తల పంకించి, అటూ ఇటూ తిరుగసాగాడు.

❖ ❖ ❖

యువరాణి చంద్రలేఖ భవంతి బయట బల్లెములను చేతబట్టి కావలి వున్న భటులతో పాటు తిమ్మయ్య కూడ నిలిచి, చుట్టూ పరిసరాలను జాగరూకతతో గమనిస్తున్నాడు.

అప్పటికే అతని పక్కగా నిలిచివున్న ఓ యువకుడు తనివితీరా ఆ మేడ అందాలను చూస్తూ తన్మయత్వంలో కనుబొమ్మలు పెద్దవి చేసి, “ఈ భవనమే ఇంత అందంగా వుంటే... ఇక రాజకుమారి ఇంకెంత అందంగా వుంటుందో కదా!?” అన్నాడు.

“నీవన్నది నిజం... మా యువరాణి ముందు దేవకాంతలు కూడ తమ అందాన్ని పరీక్షించుకుని ముఖాలు చిన్నబుచ్చుకుంటారు. మా అందాల బరిణెను చూస్తే మన్మథుడు, నలకూబరుడు లాంటి దివ్యపురుషులు వారి లోకాన్ని విడిచి

వస్తారు...” అంటూ రాజకుమారి గురించి గొప్పగా వర్ణించి చెప్పాడు తిమ్మయ్య.

“అలాంటప్పుడు మాలాంటి వీరులకు పోటీపెట్టి, భవంతిలోకి వెళ్లగలిగినవారికి యువరాణినిచ్చి పెళ్లి చేయవచ్చు కదా!” అని అతని ముఖంలోకి చూశాడా యువకుడు.

“పోటీ పెట్టి, పెళ్లి చేయడానికి ఇది స్వయంవర ప్రకటన కాదు! యువరాణి రక్షణార్థం ఏర్పాటుచేసిన మందిరం... ఇంతకీ తమరెవరు వీరకిశోరా?” అని ప్రశ్నించాడు కాస్త వ్యంగ్యంగా.

“మీ పొరుగునున్న నికుంభ రాజ్యం మాది. యువరాజు సూర్యవర్మని. మీ రాజ్యంలో పరిస్థితుల గురించి మా వేగులు చెప్పగా విని, ఈ వింత ఏమిటో చూద్దామని వచ్చాను...”

“క్షమించండి, మీరు సాధారణ పౌరుడని పొరబడ్డాను. మీరు విన్నట్టే ఈ వింత దేశదేశాలకూ పాకిపోయింది. రాజకుమారికి రెండేళ్ల వరకు వివాహం సంకల్పించే యోచన మా ప్రభువుకి లేదు!” అని వినయంగా సెలవిచ్చాడు తిమ్మయ్య.

ఆ రాజకుమారుడు నిరాశగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అక్కడికి కాస్త దూరంలో ఆ మేడ వైపు కళ్లు అప్పగించి చూస్తున్న ఓ యువకుడు తన పక్కనే వున్న తండ్రితో, “నాన్నా... ఆ మేడలోకి వెళ్లి చూడాలని వుంది!” అన్నాడు.

“ఆ లోనికి వెళితే కుత్తుక తెగి, తల కోటగుమ్మానికి వేలాడుతుంది. మొండాన్ని ఆ అగడ్తలో మొసళ్లకు ఆహారంగా వేస్తారు.. పద పద!” అంటూ కొడుకుని లాక్కుపోయాడా తండ్రి.

అదే గడియలో అక్కడికి రథం మీద వచ్చిన మహారాజు కీర్తిసేనుణ్ని

చూసి, తల వంచి అభివాదం చేశాడు తిమ్మయ్య. ఆయన వెనుక రత్నగిరి మహారాజు రథం దిగాడు. వారిద్దరూ గురుకులంలో విద్యనభ్యసించిన కాలం నుంచి మంచి మిత్రులు.

ఆ భవనసౌందర్యంతో పాటు ఆ పరిసరాలన్నీ పట్టి పట్టి చూశాడు రత్నగిరి మహారాజు. "మిత్రమా! ఏ రాజ్యంలో విన్నా మీ మాటే చెప్పుకుంటున్నారు. అది తెలిసి, ఉత్సుకతను ఆపుకోలేక నేను వచ్చాను. నా కుమారుణ్ణి నీ అల్లుడుగా చేసుకోవచ్చు కదా!"

"రెండేళ్ల వరకు మా అమ్మాయికి పెళ్లి చేసే అవకాశం లేదు. నా గారాల పట్టికి యమగండం గడవాలని మీ రాజ్యంలో కూడ పూజలు చేయించు.. పై పై అందాలు చూసేవారికి ఇది అద్భుతమైన భవంతి. కానీ నా దృష్టిలో ఇది ఒక కత్తులబోను! ఆడే పాడే వయసులో గంతులు వేయవలసిన మా బంగారుతల్లికి సంకెళ్లు వేశాను. ఈ కత్తులబోనులో బందీని చేశాను. విధి వ్రాతను ఎవరూ తప్పించలేరు!" అంటూ ఆవేదనగా పలికాడు కీర్తిసేనుడు.

రత్నగిరి ప్రభువు ఆయన భుజం తట్టి ధైర్యం చెప్పాడు.

❖ ❖ ❖

పంజరంలో చిక్కుకున్న చిలుకలా దిగాలుగా కూర్చుంది యువరాణి చంద్రలేఖ. ఆమె చుట్టూ చేరి నిలిచారు ఇష్టసఖులైన పది మంది చెలికత్తెలు.

వారిలో సంపంగి అనే చెలికత్తె ఆమె చెయ్యి పట్టుకుని, "ఎందుకమ్మా ఈ దిగులు?" అని అడిగింది.

"కన్న తల్లిదండ్రులను చూడకుండా రోజులు గడపాలంటే దిగులుకాక మరేమిటే.. ఈ ఉక్కు పంజరంలో ఇంకెంతకాలమీ శిక్ష!" అప్రయత్నంగా చంద్రలేఖ కళ్లల్లోంచి కన్నీరు జాలువారింది.

చామంతి అనే ఇష్టసఖి ఆమె కన్నీళ్లు తుడిచింది. "ఊరుకోండమ్మా... ఊరుకోండి. రోజులు ఎంత వేగంగా గడిచిపోతాయో మీరే చూడండి. మీకు తెలుసా... అప్పుడే మనం ఇక్కడికొచ్చి నాలుగు పున్నములు వెళ్లిపోయాయి. మీ క్షేమం కోసమే కదా ఈ ఏర్పాటుచేశారు. కొంచెం ఓపిక పడితే మరో నాలుగు పున్నముల నాటికి మీ పితృదేవులు, రాణీవారు మిమ్మల్ని చూడటానికి వస్తారు..."

"ఏమోనే... ఈ జీవితం దుర్భరంగా వున్నది."

చిన్నబోయిన చంద్రలేఖ మోమును చూసి, ఆ చెలికత్తెలంతా చెవుల్లో రహస్యంగా ఏదో చెప్పుకున్నారు.

వెనువెంటనే యువరాణి మందిరంలో నుంచి సంపంగి, చామంతి పరుగున వెళ్లి మరో మందిరంలోకి ప్రవేశించారు. చకచకా దుస్తులు మార్చుకుని, మారువేషాలు వేసుకున్నారు.

"అమ్మా, యువరాణీ... అటు చూడు... మీ మాతాపితరులు వస్తున్నారు" అన్నది ఓ చెలికత్తె ఆశ్చర్యం నటిస్తూ.

"అవునా!" అంటూ ఉత్సాహంగా లేచి, అటు చూసింది చంద్రలేఖ.

సంపంగి, చామంతి పక్కపక్కనే నడుస్తూ కీర్తిసేనుణ్ణి, శాంభవీదేవిని అనుకరిస్తూ ఆమె సమీపానికి వచ్చారు.

చామంతి తనకు లేని మీసాన్ని మెలితిప్పుతున్నట్టు అభినయిస్తూ, మహారాజు గొంతును అనుకరిస్తూ. "ఏమిటి అమ్మాయీ... నీవు నీ ఇష్టసఖుల మాటలు వినడం లేదట! బాగా అల్లరి చేస్తున్నావట! ఇప్పటికైనా నీ ప్రవర్తన మార్చుకోకపోతే కఠినంగా శిక్షిస్తాం... ఇది రాజాజ్ఞ!" అంటూ ఠీవిని ఒలకబోసింది.

సంపంగి మహారాణిని అనుకరిస్తూ, "మీ నాన్నగారి మాట వినమ్మా... లేకపోతే మనకు తిప్పలు తప్పవు!" అంటూ దగ్గుత్తికతో పలుకుతూ గొప్పగా నటించింది.

చంద్రలేఖకు ఒక్కసారిగా నవ్వు ముంచుకొచ్చింది. నవ్వు ఆపుకోలేక పడిపడి నవ్వింది. ఆమెను చూసి చెలికత్తెలంతా నవ్వారు.

చంద్రలేఖ బలవంతంగా నవ్వు ఆపుకుని సంపంగి చామంతి మీద కోపం నటిస్తూ వారిని కొడతానని బెదిరిస్తూ ముందుకు వచ్చింది. ఆ చెలికత్తెలు నవ్వుతూ ఆమెకి దొరకకుండా చిన్నగా పరుగులు తీశారు. వారి వెంటపడి చంద్రలేఖ కూడ పరుగెత్తింది. మిగతా ఇష్టసఖులు వారి వెనకే వెళ్లారు.

ఆ విధంగా ఆ యువరాణి దిగులును పోగొడుతూ అంకితభావంతో సేవలు చేస్తున్నారా చెలికత్తెలు.

❖ ❖ ❖

"ఏమిరా నాయనా... ఈమధ్య మరీ నల్లపూసవైపోయావు. తేనె లేకుండా నాకు తిండి సహించదని నీకు తెలుసు కదా! తెలిసి కూడ ఇంత ఆలస్యంగా వస్తావా?" అని ప్రశ్నించాడు తిమ్మయ్య.

చూపులకు మన్మథుణ్ణి తలపించేలా వున్న ఆ యువకుడు చిన్నగా నవ్వి, "అయ్యా! తేనెపట్టు పట్టి, తేనె పట్టడం మాటలు కాదండి... తేనెటీగలతో వస్తుంది పెద్దచిక్కు. అజాగ్రత్తగా వున్నామంటే కుట్టి చంపుతాయి. భయపడి పట్టు వదిలేస్తే ఏ పైనుంచి పడినా సున్నంలోకి ఎముకలు మిగలవు... ఎటు చూసినా చచ్చే చావు వచ్చిపడుతుంది. తేనె తియ్యనే గాని, చావు చేదండీ! మీకేమి శ్రమ, తీరిగ్గా కూర్చుని తుమ్మెదలాగ తేనెతిండి తింటారు. ఎటొచ్చీ, తేనెటీగల కష్టాలన్నీ మావే!" అంటూ కడుక్కున్న చేతులను తుండుగుడ్డతో

తుడుచుకున్నాడు.

“భలేవాడివిరా... ఒక్కమాట అడిగితే మళ్లీ మాట్లాడకుండా సమాధానం చెప్పావు!” అంటూ పకపకా నవ్వాడు తిమ్మయ్య.

“ఇంతకీ నువ్విప్పుడు తెచ్చింది అతిమధురమే కదా!”

“మధురాతి మధురమండీ... మీ గృహంలో తేనె కోసం కేటాయించిన చోట భద్రంగా పెట్టి వచ్చాను. నాకు ఇవ్వవలసిన చిల్లర నాణాలిస్తే వెళ్లిపోతాను...” అన్నాడా యువకుడు వినయంగా.

“ఇంతకాలంగా నువ్వు నాకు తేనె పట్టుకొస్తున్నా నిన్నెప్పుడూ పేరు అడగలేదు సుమా!”

“ఎలా అడుగుతారండీ... మీ జిహ్వాకి తేనె తప్ప మరోదానిమీద దృష్టి నిలవదు” అన్నాడు.

అప్పుడే వంటగృహం నుంచి అక్కడికి వచ్చిన ఓ పెద్దావిడ తేనె తొనల గిన్నెను తిమ్మయ్యకి అందిస్తూ, “మా బాగా చెప్పావు నాయనా! వీడికి తిండియావ ఎక్కువ. ఇంకేదీ పట్టదు. అలా అని అదే పనిగా తినడు. చిత్రమైన మనిషి అనుకో...”

“మా వంటలక్క నాకు దూరపు బంధువు. నన్ను సొంత తమ్ముడిలా చూస్తుంది. నాకు దిష్టి తగులకూడదని అలా చెబుతుంది. నిజానికి నాకు తిండియావ ఎక్కువే. తేనెతిండి అంటే మరీ ఎక్కువ. మా అక్క వండిన, తేనెలో ముంచి తీసిన ఈ  తొనలు చూడు ఎంత మధురంగా వుంటాయో!” అంటూ ఆ గిన్నెను ఆ యువకుడికి అందించాడు తిమ్మయ్య.

ఒక తొన తీసుకుని నోటిలో వేసుకున్నాడా యువకుడు. కాసేపు కళ్లప్పగించి చూశాడు. అతడికి ఏమైందోనని తిమ్మయ్య కంగారుపడ్డాడు.

"మధురాతి మధురం... నోట్లో వేసుకుంటే కరిగిపోయింది!" అన్నాడు యువకుడు.

"మరేమనుకున్నావ్ మా కాంతం అక్క వండి పెట్టింది ఏదైనా అమృతమే... తిను తిను..." అని తిమ్మయ్య అనగానే మొహమాటం వదిలి, గిన్నెను ఖాళీ చేశాడు ఆ యువకుడు. ఆ తర్వాత మట్టి పిడతతో చల్ల తాగి తృప్తిగా తల వూపాడు.

"ఇంతకీ నీ పేరేమిటి నాయనా?" అని అడిగింది కాంతం.

"అమ్మా... నాపేరు మణిదీపుడు..."

"ఓరోరి... మనమిద్దరం ఇంచుమించుగా సమాన వయసువాళ్లం. బహుశా నీకంటే ఐదారు సంవత్సరాలు నేను పెద్దవాణ్ణి కావచ్చు. నాపేరులో లేని అందం నీ పేరులో వుందిరా!" అన్నాడు తిమ్మయ్య.

"నేను పుట్టినప్పుడు, దారిన పోతున్న ఓ సన్యాసి నాకా పేరు పెట్టాడని మా అమ్మా అయ్యా చెప్పారండి..."

"నీ ముఖారవిందం చూసి పెట్టి వుంటాడులే నాయనా! రాజవంశంలో పుట్టవలసినవాడివి, పేదరికంలో పుట్టావు..." అన్నది కాంతం.

"పేదరికం అయితే మాత్రం ఏమైందమ్మా... అదేమన్నా అంటరానిదా? మనిషిలోని మంచిని చూడాలిగాని, రాజైతే ఏమిటి? పేదైతే ఏమిటి? కష్టపడి పని చేస్తూ తృప్తిగా బ్రతకడంలోనే ఆనందం వుందని మా అయ్య చెప్పాడు..."

"చిన్నవాడివైనా మంచిమాట చెప్పావు నాయనా! ఇక్కడికి వచ్చినప్పుడు నాకు కనిపిస్తూ వుండు..."

"భళిరా మణిదీపా! మా అక్కగారి అభిమానం సంపాదించుకున్నావ్. ఇక నువ్వు వచ్చినప్పుడల్లా, పంచభక్ష్య పరమాన్నాలు కొసరి కొసరి వడ్డిస్తుంది

మా అక్క...” అన్నాడు తిమ్మయ్య నవ్వుతూ.

అతడి మాటలకు వాళ్లిద్దరూ నవ్వారు.

“నీ వెంట ఓ భటుణ్ణి పంపిస్తాను. కోటలోకి వెళ్లి ఖజానా అధికారిని కలుసుకో. నా పేరు చెప్పి నీకు రావలసిన నాణాలు తీసుకో...” ధీమాగా చెప్పాడు తిమ్మయ్య.

“నాణాలే ఇస్తాడో, చెఱసాలలో వేస్తాడో!”

“కోటలో నా పరపతి ఏమిటో వెళ్లి చూడు...” అన్నాడు.

అతడు చెప్పినట్టే తిమ్మయ్య పేరు వినగానే ఖజానా అధికారి మణిదీపుడితో వినయంగా మాట్లాడి, పక్షం రోజులకు రావలసిన నాణాలను లెక్కగట్టి, వాటిని గుడ్డసంచిలో వేసి అతడికి అందించాడు.

యువరాణి మందిర రక్షణకు ప్రత్యేకించి ఏర్పాటు చేయబడిన తిమ్మయ్య ఏం అడిగితే అది ఇవ్వమని రాజాజ్ఞ. అతడికి గాని, ఒంటిస్తంభం మేడ రక్షణలో వున్న భటులు, సైనికులకు ఏమాత్రం లోటు చెయ్యకూడదని మహారాజు ప్రకటించారు. నమ్మిన బంటు తిమ్మయ్య అంటే రాజకుటుంబానికి ప్రత్యేక అభిమానం వుండనే వున్నది.

❖ ❖ ❖

ఇష్టసఖుల పుణ్యమా అని చంద్రలేఖ ఆడుతూ పాడుతూ సంతోషంగానే వున్నది. తల్లిదండ్రులను మరిపిస్తూ ఆ పది మంది చెలికత్తెలు ఆమెను తమ ప్రాణాల కంటే మిన్నగా చూసుకుంటున్నారు

వాళ్లు కాక ఆ మందిరంలో యువరాణికి సేవ చేయడానికి నియోగించబడిన పరిచారికలు వంద మంది వున్నారు. వంటల దగ్గర నుంచి మొదలుకుని చంద్రలేఖ ధరించే వస్త్రాల వరకు అన్నీ సమకూర్చి పెట్టడానికి

ఆ భవనంలో ఎక్కడికక్కడ తగిన ఏర్పాట్లు చేశారు. దేనికోసం ఆ మేడ దాటి వచ్చే పనేలేదు. అందుకు అవకాశామూ లేదు. లోపల ఒక్క మగపురుగు లేదు. అందరూ కన్యకలే! యువరాణి కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా ఇవ్వగల సౌశీల్యవతులే!

ఆ భవనం మిద్దె మీద చంద్రలేఖ కోసం ఒక ఉద్యానవనం, ఆ వనం మధ్యలో కనులు మిరుమిట్లు గొలిపే ఒక నీటిమడుగును నిర్మించారు. అసుర శిల్పి మయుడు వచ్చి సృష్టికి ప్రతిసృష్టి చేశాడా అన్నట్టు వున్నదా మిద్దె వైభవం.

కట్టుదిట్టమైన ఇంత కాపలాను ఛేదించుకుని యువరాణికి హాని తలపెట్టేది ఎవరై వుంటారా, ఆ మాయ ఏమై వుంటుందా అని కాపలా భటులంతా బుర్రలు బ్రద్దలు కొట్టుకుని యోచిస్తూ ఊహాగానాలు చేస్తున్నారు. కాని ఆ ప్రమాదం ఏమిటో వాళ్లెవరికీ అంతుపట్టకుండా వున్నది.

తిమ్మయ్య బుర్రలో కూడ అవే ఆలోచనలు తేనెతుట్టెను పట్టిన ఈగల్లా తిరుగుతూ వున్నవి.

❖ ❖ ❖

యువరాణి రక్షణ గురించి తలపోస్తున్న తిమ్మయ్యకి ఓ ఆలోచన తట్టింది. ఆ మరునాడు ఇద్దరు భటులను పంపించి, మణిదీపుణ్ణి తన సమక్షానికి రప్పించాడు.

అతడు వచ్చీరావడంతోనే, “రాజుగారి కొలువులో పనిచేస్తావా? పని ఏమిటంటే, నాతో పాటు నా గృహంలో వుంటూ నేను విశ్రాంతి తీసుకునే సమయంలో రాజకుమారి భవన పరిసరాలను నువ్వు శ్రద్ధగా కాపలా కాయాలి. నీకు ఏమాత్రం అనుమానం వచ్చినా నన్ను నిద్రలేపాలి... ఎంతకాలమని తేనెతుట్టెలు పట్టుకుంటూ, తేనెటీగలతో యుద్ధం చేస్తావు. వీరుడిలా వచ్చి, నీ

రాజభక్తిని చూపించు. నీకు ఏ లోటు రాకుండా నేను చూస్తాను. నీ తల్లిదండ్రులు ఆశ్చర్యపడేలా పెద్దమొత్తంలో జీతం ఏర్పాటు చేస్తాను... ఏమంటావ్?" అని అడిగాడు తిమ్మయ్య.

"ఇంతగా అడగవలసిన పనిలేదు స్వామీ! ఈ తేనెటీగల గొడవ ఎప్పుడూ వుండేదే... ఇంత మంచి కొలువు ఇస్తానంటే వద్దంటానా? మా అమ్మా నాన్నలకు చెప్పి, చీకటి పడే వేళకి వచ్చేస్తాను. కానీ నాకు కత్తిపోరాటాలూ అవీ అంతగా రావు..."

"వీలు చిక్కినప్పుడల్లా అవన్నీ నీకు నేను నేర్పిస్తాను..."

"అంత భరోసా ఇస్తే నాకు భయమేమిటి? యువరాణి రక్షణలో నా ప్రాణాలైనా ఇస్తాను!" గుండెల మీద చెయ్యి వేసుకుని మనస్ఫూర్తిగా అన్నాడు మణిదీపుడు.

"భళిరా వీరుడా!" అంటూ అతణ్ణి స్నేహపూర్వకంగా ఆలింగనం చేసుకున్నాడు తిమ్మయ్య.

❖ ❖ ❖

కన్నబిడ్డను చూడటానికి చంద్రలేఖ తల్లిదండ్రులు రాక రాక వచ్చారు.

తిమ్మయ్య భటులకు ఆజ్ఞాపించగానే వారు రాతి చక్రాలను తిప్పారు. రెండు రథాలు ఒక్కసారిగా వెళ్లగలిగే ఓ బలమైన ఉక్కుపలక మెల్లగా దిగి, అగడ్త మీద వాలింది. దాని మీదుగా కీర్తిసేనుడు, శాంభవీదేవి, తిమ్మయ్య సింహద్వారం దగ్గరకొచ్చారు.

అగడ్తలో తిరుగాడుతున్న మొసళ్లు తలలెత్తి పైకి చూస్తున్నాయి.

తిమ్మయ్య ఓ పక్కగా వెళ్లి, భవనం గోడలో రహస్యంగా అమర్చిన ఓ మరతిప్పాడు.

కిర్రుమని శబ్దం చేస్తూ గోడలోకి ఓ రహస్య ద్వారం తెరుచుకున్నది. ఆ లోపలికి అడుగు వేసి, అక్కడ వున్న కొన్ని మరలు తిప్పాడు.

సరిగ్గా అదే సమయంలో సింహద్వారం తెరుచుకున్నది. మహారాజును, మహారాణిని మెట్లదారి వెంట రాజకుమారి విశ్రాంతి మందిరానికి తీసుకువెళ్లాడు.

తల్లిదండ్రులను చూడగానే ఒక్క పరుగున వచ్చి, వారిని చుట్టేసింది చంద్రలేఖ.

ఆమెకి కన్నీళ్లు ఆగలేదు.

డగ్గుత్తికతో కాసేపు మాట రాలేదు.

చివరికి మహారాణి శాంభవీదేవి కూతురు కన్నీళ్లు తుడిచి,

"ఎలా వున్నావమ్మా?" అనగలిగింది.

"ఇక్కడ నీకు అన్నీ సమకూరుతున్నాయా తల్లీ..." అంటూ కూతురు తల నిమిరాడు కీర్తిసేనుడు.

"తల్లిదండ్రులు లేని లోటును ఎవరు పూరించగలరు నాన్నగారూ... అయితే నా ఆవేదన పోగొట్టడానికి నా ఇష్టసఖులు చేస్తున్న సేవను మాటల్లో చెప్పలేను..." అంటూ దూరంగా ఆగిపోయిన చెలికత్తెలను దగ్గరికి రమ్మని పిలిచింది చంద్రలేఖ.

ఆ పది మంది ఇష్టసఖులు పరుగున వచ్చి మహారాజుకు, మహారాణికి తలలు వంచి అభివాదం చేశారు.

"మీ సేవలను మరచిపోము తల్లీ... తగిన బహుమానం అందిస్తాము..." అన్నాడు మహారాజు ఆ చెలికత్తెల వైపు వాత్సల్యంగా చూస్తూ.

కాస్త దూరంగా నిలుచున్న తిమ్మయ్య ఆ భవంతిలోని వైభవం చూసి, ఆనందంగా వున్న యువరాణిని చూసి ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. రాజభక్తిగల

ఆ యువవీరుడు చాలా సంతోషించాడు. అతణ్ణి పలకరించి యోగక్షేమాలు అడిగింది చంద్రలేఖ. "తల్లిదండ్రులు కోటలోకి వెళ్లడానికి సిద్ధపడుతూండగా," ఈ చెఱసాల జీవితం నాకింకా ఎంతకాలమమ్మా?" అని ప్రశ్నించింది చంద్రలేఖ.

"చూస్తూ వుండగానే రోజులు గడిచిపోతాయి. కొంచెం ఓపిక పట్టు తల్లీ..." అంటూ కీర్తిసేనుడు కుమార్తెకు హితవచనాలు చెప్పి అనునయించాడు.

❖ ❖ ❖

మణిదీపుడు తిమ్మయ్య గృహానికి వచ్చి చేరాడు. వచ్చీరావడంతోనే అతడితో పాటు యువరాణి భవనానికి కాపలా కాయసాగాడు. ఆ వీరుడి ప్రభుభక్తికి సంతోషించాడు తిమ్మయ్య.

ఆ ఇద్దరికీ ఎప్పుడు ఏం కావాలన్నా వండి పెడుతున్నది కాంతం. "పెద్దమ్మా..." అని పిలుస్తూ ఆమె ప్రేమను సంపాదించుకున్నాడు మణిదీపుడు.

అవకాశం వున్నప్పుడల్లా కాస్తో కూస్తో తనకి తెలిసిన యుద్ధ విద్యలను అతడికి నేర్పిస్తున్నాడు తిమ్మయ్య. అంతే కాదు, అతడి భాషను కూడ సంస్కరించి హుందాతనంగా మాట్లాడటం నేర్పించాడు.

కొన్ని పున్నములు గడిచేసరికి భటులకు, సైనికులకు అతడు అభిమాన పాత్రుడయ్యాడు. కాపలా కాసేటప్పుడు మణిదీపుడు చూపించే నేర్పరితనాన్ని చూసి అతడి భుజంతట్టాడు తిమ్మయ్య. "భళిరా మణిదీపా! ఏమో అనుకున్నాను గానీ గట్టివాడివేరా... నువ్వు నా శిష్యుడివైనందుకు గర్వపడుతున్నాను" అంటూ మీసం మెలేశాడు.

"నువ్వు నా గురువు అయినందుకు నేనూ గర్వపడుతున్నాను" అంటూ తనకున్న చిన్నపాటి మీసాన్ని తిప్పడానికి ప్రయత్నించాడు మణిదీపుడు.

అది చూసి పగలబడి నవ్వుతూ అతడి భుజం మీద గట్టిగా చరిచాడు

తిమ్మయ్య.

"ఇదేమిరా! నిన్ను కొడితే నా చెయ్యి నొప్పిగా వుంది..." అన్నాడు చెయ్యి వూదుకుంటూ. మణిదీపుడు చిన్నగా నవ్వాడు.

❖ ❖ ❖

ఒకనాడు యువరాణి మందిరం వద్దవుండి కాపలా కాస్తున్న మణిదీపుడికి తేనెటీగల సన్నని రొద వినిపించింది. చిన్నపాటి ఆ శబ్దం ఇతర భటులకు వినిపించలేదు.

అతడు తలపైకెత్తి చూశాడు. తేనెటీగల గుంపు వెళుతున్న దిశను గమనించి, అటువైపు అడుగులు వేశాడు.

చాలా ఎత్తులో చంద్రలేఖ విశ్రాంతి మందిరానికి ఓ మూలగా తేనెపట్టు కనిపించేసరికి ముక్కున వేలేసుకున్నాడు అతడు.

"ఓరి మీ అసాధ్యం కూలా! ఇంతమంది వీరులం కాపలా వుండగానే, మా లెక్కలేకుండా తేనెపట్టు పెడతారా! ఇక్కడ మీ పాలిట యముడు వున్నాడని మరిచారా! చూస్తాను... మీ అంతు చూసిగాని నిద్రపోను..." అంటూ వీర శపథం చేశాడు మణిదీపుడు. ఆ మరుసటి ఉదయం ఆ విషయాన్ని తిమ్మయ్య చెవిన వేశాడు.

"ఆఁ.. ఆ తేనెటీగలకు ఎంత కండకావరం! వాటి అంతు చూడవలసిందే... వాటిని చెదరగొట్టడంలో నీ ప్రతాపం చూపించు. తేనెటీగ శత్రువుల ద్వారా రాజకుమారికి ఎలాంటి అపకారం జరగకముందే వాటిని తరిమి కొట్టవలసిన బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను" అంటూ ఆజ్ఞాపించాడు తిమ్మయ్య.

వెంటనే కార్యరంగంలోకి దూకాడు మణిదీపుడు. బలమైన తాడు

సహాయంతో కోటగోడ లాంటి మందిరంపైకి పాకుతూ వెళ్లి, పొడవైన ఓ కర్రను ఒరలోంచి కత్తిలా తీసి తేనెతుట్టెను తుత్తునియలు చేశాడు.

తేనెటీగలు ఝుంకారం చేస్తూ తోచిన దిక్కుగా ఎగిరిపోతున్నాయి. ఆ శబ్దం విని అటువైపు వచ్చిన చంద్రలేఖ మందిర గవాక్షం నుంచి కిందకి తొంగి చూసింది.

గాలిలో వేలాడుతూ తనవైపు దూసుకొస్తున్న తేనెటీగలపై ప్రతాపం చూపిస్తున్న మణిదీపుణ్ణి చూసి ఆశ్చర్యపోయింది. ఆసక్తిగా మరికాస్త ఒంగింది. చెయ్యి పట్టుజారిపోవడడంతో కెవ్వుమని కేక వేసి గవాక్షం నుంచి కిందికి జారిపోయింది ఆమె.

కేక విన్న వెంటనే ఏం జరిగిందో గ్రహించిన మణిదీపుడు కనురెప్పపాటులో చంద్రలేఖ చెయ్యి పట్టుకున్నాడు. అతడి చెయ్యి పట్టుతో గాలిలో వేలాడుతున్నది యువరాణి.

మందిరం కింద నుంచి భటులు, గవాక్షం లోపలి నుంచి చెలికత్తెలు హాహాకారాలు చేస్తున్నారు. మణిదీపుడి అంతు చూడాలనుకున్న తేనెటీగలు ఈ సందడికి ఎటో ఎగిరిపోయాయి.

“భయపడకండి యువరాణీ... ప్రమాదం లేదు...” అంటూ బలమంతా చేతిపట్టులోకి తెచ్చి, మెల్లగా చంద్రలేఖను పైకి లాగాడు అతడు.

పై వరకు వచ్చిన ఆమె భయంతో మణిదీపుడి మెడను గట్టిగా పట్టుకున్నది. అతడు తాడు సాయంతో మెల్లగా జరుగుతూ గవాక్షం సమీపంగా వచ్చాడు.

వెనువెంటనే గవాక్షం లోపలి వైపు సిద్ధంగా వున్న నలుగురు చెలికత్తెలు చంద్రలేఖను అతడి చేతి పట్టులోంచి అందుకుని, లోపలికి లాక్కున్నారు.

అప్పటికే భయంతో మూర్ఛపోయింది యువరాణి. ఆమెను మెల్లగా

హంసతూలికాతల్పం మీదకు చేర్చి, శుశ్రూష చేస్తున్నారా ఇష్టసఖులు.

❖ ❖ ❖

"ఎంత ప్రమాదం తప్పింది... ఎంత ప్రమాదం తప్పింది..." కీర్తిసేనుడు ఆ మాటను ఎన్ని మారులు జపించాడో ఆయనకే తెలీదు. విషయం తెలిసిన వెంటనే పరుగుల మీద వెళ్లి యువరాణిని కలిశారా దంపతులు. శాంభవీదేవి కళ్ల నీళ్లు పెట్టుకుంది.

"ఆ పరమేశ్వరుడే నిన్ను రక్షించాడు తల్లీ... ఎందుకిలా జరిగిందో అర్థం కాకుండా వున్నది. ఏ జన్మలో ఎవరికి అపకారం చేశామో తెలియకున్నది!" అంటూ కూతురుని గుండెలకు హత్తుకున్నది.

మౌనంగా తల వూపాడు మహారాజు. కొన్ని గడియల పాటు అక్కడే వుండి చంద్రలేఖకు ధైర్యం చెప్పారు ఆమె తల్లిదండ్రులు.

కూతురుని వదిలి రాలేకున్న శాంభవీదేవిని బలవంతాన కోటకు తీసుకువచ్చాడు కీర్తిసేనుడు. ఆ మరునాడు జ్యోతిష్య పండితులతో అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేశాడు.

"మా కుమార్తె మందిరం వద్ద జరిగిన సంఘటన గురించి మీరు విని వుంటారు" అన్నాడు కీర్తిసేనుడు.

ఆ పండితులు సమాధానంగా తలలు ఆడించారు.

"దీనిపై మీ అభిప్రాయం చెప్పండి. యువరాణికి ప్రమాదం వున్నదని అన్నారు. ప్రమాదం తప్పింది కాబట్టి కీడు తొలగిపోయిందని మేము భావించవచ్చునా?" అని ప్రశ్నించాడు కీర్తిసేనుడు.

ఆ పండితులెవరూ జవాబు చెప్పలేదు. కొండుభట్టు మాత్రం వేళ్ల మీద లెక్కలు వేశాడు. తర్వాత మహారాజు ముఖంలోకి చూసి, "క్షమించండి

మహారాజా! కీడు పూర్తిగా తొలగిపోలేదు... ప్రమాదం పొంచి వున్నది!” అన్నాడు.

కీర్తిసేనుడి ముఖంలో భయం తాలూకు నీడ పొడచూపింది. “భట్టుగారూ... అయితే ఇప్పుడు మేము ఏం చెయ్యాలో సెలవియ్యండి.”

“మీరేమీ చెయ్యొద్దు... ఇప్పటికి దాదాపుగా ఒక వత్సరం గడిచింది. మరో వసంతం వెళ్లనివ్వండి, కీడు పూర్తిగా తొలగిపోతుంది. అప్పటివరకు రాజకుమార్తెను ఆ మందిరంలోనే కట్టుదిట్టమైన కాపలాలో వుండనివ్వండి...” అని చెప్పాడు కొండుభట్టు.

“అలాగే... మీరు చెప్పినట్టే చేస్తాను” అన్నాడు కీర్తిసేనుడు.

❖ ❖ ❖

“భళిరా భళి మణిదీపా! నక్కని తొక్కివచ్చావు” గృహంలోకి వచ్చిన తిమ్మయ్య అన్నాడు. భటుడి వస్త్రాలు ధరించి రాత్రి కాపలాకి సిద్ధపడుతున్న మణిదీపుడు “ఏమిటి... ఏం జరిగింది?” అంటూ చిత్రంగా చూశాడు.

అప్పుడే ద్వారం దాటి లోనికి వచ్చిన ఆరుగురు పరిచారికల చేతుల్లో మొహిరీలు, మణిమాణిక్యాలు, బంగారుకాసులతో నిండి వున్న ఆరు పళ్లెములున్నవి.

“యువరాణి ప్రాణాలను కాపాడి రాజకుటుంబానికి సేవ చేసిన నీకు కృతజ్ఞతాపూర్వకంగా కీర్తిసేన మహారాజు పంపించిన కానుకలివి...” అని చెప్పాడు తిమ్మయ్య.

“ఇందులో నా గొప్పతనం ఏముంది? మహారాజు జీతం ఇస్తున్నారు... నా ధర్మం నేను నిర్వర్తించాను... ఇవన్నీ నాకెందుకు?” అనాసక్తిగా అన్నాడు.

“కొంప ముంచకు నాయనా! పంపిన కానుకలు వద్దంటే రాజుగారికి కోపం వస్తుంది. మారు మాట్లాడక తీసుకో... అది మర్యాద!” అని తిమ్మయ్య

చెప్పేసరికి తల పంకించాడు.

పరిచారికలు ఆ పళ్లెములను అక్కడ ఎదురుగా వున్న మంచము మీద పెట్టారు. బంగారు మొహిరీలు గుప్పెడు గుప్పెడు తీస్తూ ఆ ఆరుగురు పరిచారికలకు ఇచ్చాడు మణిదీపుడు.

ఆ కన్నెపిల్లలు ఆనందంతో అతడికి అభివాదం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత తిమ్మయ్య వైపు తిరిగి, "ఇదంతా నువ్వే తీసుకో... ఎందుకూ పనికిరాకుండా తేనెపట్టులతో వేలాడే నాకు కొలువు ఇప్పించి, నీకు తెలిసిన విద్యలు నేర్పించావు. నీ మేలు ఎలా మరచిపోతాను!" అన్నాడు మిత్రభావంతో చూస్తూ.

తిమ్మయ్య కళ్లు ఆనందంతో మెరిశాయి. "ఆ మాట చాలురా... ఇవి నాకు వద్దు. మీ అమ్మా నాన్నలకు పంపించు. నీ ప్రయోజకత్వం చూసి వాళ్లు గర్వపడతారు..." అంటూ అతడి భుజం తట్టాడు.

❖ ❖ ❖

రెండు రోజుల తర్వాత మొదటి అంతస్తు గవాక్షం నుంచి ఓ చెలికత్తె తల వంచి, బిగ్గరగా అరచి పిలిచింది. ఇద్దరు భటులు తలలు పైకెత్తి ఏమిటని సైగల ద్వారా అడిగారు.

"తిమ్మయ్యని తమ సమక్షానికి ఓసారి రమ్మని యువరాణీ వారు చెప్పమన్నారు" అరచి చెప్పింది ఆ చెలికత్తె.

వెంటనే ఆ వార్త తిమ్మయ్య చెవికి చేరింది. ఆశ్చర్యంతో అతడి భృకుటి ముడిపడింది. రాజకుమారి తనను ఎందుకు రమ్మన్నట్టు? ఆ భవంతిలో సర్వసౌకర్యాలు అమర్చి వున్నాయి కదా! అమ్మాయి గారికి తనతో ఏం పని పడింది?

ఎంత యోచించినా తిమ్మయ్యకి తోచలేదు... అదేమిటో యువరాణిని అడిగితే తెలిసిపోతుంది అనుకున్నాడు. మరు గడియలోనే వెళ్లి చంద్రలేఖను కలిశాడు.

తన చుట్టూ వున్న పరిచారికలను, ఇష్టసఖులను చేసైగతో పంపించివేసి అతడి క్షేమ సమాచారాలను అడిగింది. తర్వాత నెమ్మదిగా అసలు విషయం అడిగింది.

"అవును తిమ్మయ్యా... ఆ రోజు తెగించి నన్ను రక్షించిన ఆ వీరుడి పేరు ఏమిటి?"

"మీ రక్షణ కోసం పహారా కాసే ఆ భటుడి పేరు మణిదీపుడు..." వినయంగా చెప్పాడు.

"ఆ యువవీరుణ్ణి ఒకసారి నా వద్దకు పంపించు..."

"ఎందుకమ్మా?" సంకోచం లేకుండా ప్రశ్నించాడు.

"తిమ్మయ్యా... ఎందుకో మేము నీకు చెప్పాలా?" ఒక్కసారిగా చంద్రలేఖ ముఖ కవళికలు మారిపోయాయి. ఎన్నడు ఆమెలో కోపాన్ని చూడని అతడు ఆశ్చర్యపోయాడు.

"క్షమించండి యువరాణీ... మీ రక్షణ బాధ్యతను ప్రభువులవారు నాకు అప్పగించారు. వారి ఆజ్ఞానుసారం ఎవరినీ మీ సమక్షానికి పంపించడానికి నాకు అధికారం లేదు..." నిష్కర్షగా చెప్పాడు తిమ్మయ్య.

"ఒక ముఖ్యమైన, అతి నిగూఢమైన విషయాన్ని గురించి మణిదీపుడికి చెప్పవలసి వున్నది. అతణ్ణి రహస్యంగా నా వద్దకు పంపించే ఏర్పాటు నువ్వే చెయ్యాలి... ఇది యువరాణి ఆజ్ఞ!"

"అమ్మా యువరాణీ... నన్ను ఇరకాటంలో పెట్టేశారు! ఈ విషయం

మహారాజుకు తెలిస్తే నా తల తీయించేస్తారు!”

“నేను చెప్పిన పని చెయ్యకపోయినా నీ తల ఎగిరిపోతుంది... ఆలోచించుకో!” ఒరలోంచి చురకత్తిని తీసి అటు ఇటు వూపుతూ గంభీరంగా పలికింది యువరాణి చంద్రలేఖ.

“ఎటూ తలపోవడం తప్పనప్పుడు, ఆ తల ఎప్పుడు ఎలా పోతే ఏముందమ్మా... నీ ఇష్టప్రకారమే కానియ్యి! నీ ఆజ్ఞను శిరసావహించి మణిదీపుణ్ణి ఈ రాత్రికే రహస్యంగా పంపిస్తాను” అంటూ తల వంచి అభివాదం చేసి, వెళ్లిన దారినే భవనం బయటికి వచ్చాడు తిమ్మయ్య.

❖ ❖ ❖

వెన్నెల్లో నులక మంచం మీద జారబడి ఆకాశాన నిండు చంద్రుణ్ణి చూస్తూ కూనిరాగాలు తీస్తున్నాడు మణిదీపుడు.

“భళిరా భళి... రాచపుట్టుక పుట్టకపోయినా, నీ చేతిలో సుడి చిత్రంగా తిరుగుతున్నదిరా మణిదీపా!” అంటూ చతురోక్తి విసిరాడు తిమ్మయ్య.

“మీరు ఏమంటున్నారో నాకు అర్థం కావడం లేదు” రాగం ఆపి అన్నాడు అతడు.

“యువరాణిని కలిసేవరకు నాకూ అర్థం కాలేదు” అంటూ జరిగింది చెప్పాడు.

“మీరు పొరబడి వుంటారు. యువరాణీ వారు ఏదైనా ప్రమాదాన్ని గుర్తించి వుంటారు. ఆ విషయమై నా సహకారాన్ని తీసుకోవాలని మీకు కబురుపెట్టి వుండొచ్చు కదా!” తన సందేహాన్ని వెలిబుచ్చాడు మణిదీపుడు.

“అదే నిజమైతే, రాజ కుంటుంబానికి నమ్మకస్తుడినైన నాకు చెప్పడానికి ఆమెకి అభ్యంతరం ఏమిటి?”

"మీరు చెప్పేదీ నిజమే!"

"యువరాణి నిన్ను ప్రేమిస్తున్నదని నా అనుమానం!"

"అపూర్వ సౌందర్యవతి, అందని ఆకాశం వంటి ఆమె ఎక్కడ? మీకు పరిచయం కానంత వరకు కఠిన పేదరికంలో మగ్గిన నేనెక్కడ? మీ పుణ్యమా అని ఈ కొలువు దొరికింది. మాహారాజు పుణ్యమా అని వెలలేని కానుకలు కూడ దక్కాయి. ఆ తృప్తి చాలు... యువరాణిని కలుసుకోవలసిన అవసరం నాకు లేదు!"

కెవ్వుమని అరచినంత పని చేశాడు తిమ్మయ్య. "అయ్యా మణిదీపా! రాజకుటుంబంపై నీ భక్తి గౌరవాలు అలాగే వుండనియ్యి. కానీ వెళ్లనని మాత్రం అనకు. నువ్వు రాజకుమార్తెను కలసి తీరవలసిందే! నా తల ఇప్పుడు కత్తుల బోనులో వుంది. నువ్వు వెళ్లనంటే అది కాస్తా పుటుక్కున తెగిపోతుంది. చచ్చి నీ కడుపున పుడతాను... ఆ మాట మాత్రం అనకు నాయనా!"

అతడి మాట తీరుకు చిన్నగా నవ్వాడు మణిదీపుడు.

అతడి చెయ్యి తీసుకుని తల మీద పెట్టుకుని, ఒట్టు వెయ్యమన్నట్టు సైగ చేశాడు తిమ్మయ్య.

❖ ❖ ❖

"పహరా హుషార్... పహరా హుషార్..." అంటూ బల్లెములు పట్టుకున్న భటులు యువరాణి భవన పరిసరాలలో పహరా కాస్తున్నారు. విచ్చు కత్తులు పట్టుకున్న సైనికులు భవనం ముందు కావలి వున్నారు.

చంద్రుడు పుచ్చపువ్వులను విరజిమ్మినట్టు వెన్నెల వెలుగులు ఆ పరిసరాలను ప్రకాశవంతం చేస్తున్నాయి.

తిమ్మయ్య ఆజ్ఞ ప్రకారం ఆ భవంతి వెనుక పక్క మణిదీపుడు కావలి

కాస్తున్నాడు.

నిశిరాత్రి సమయం ఆసన్నమయింది. ఓ పక్కగా పెట్టుకున్న పెద్ద తాడుని, ఆ తాడుకి ఓవైపు బిగింపుగా కట్టిన ఉడుముని చేతుల్లోకి తీసుకున్నాడు అతడు.

తన నడుముకు కట్టుకున్న దట్టీలో దాచిన చిన్న బరిణెను బయటికి తీశాడు మణిదీపుడు. అందులో వున్న తేనెను ఉడుము నోటిలో కొంత పోశాడు. మిగిలివున్న కాస్త తేనెను దాని మూతికి రాసి, ఉడుమును భవంతి గోడకు ఆనించాడు.

అంతే... ఉడుము భవంతి గోడపైకి నిట్టనిలువుగా పాకుతూ వెళ్లసాగింది. తనతో పాటు అది త్రాడును కూడ పైకి తీసుకుపోయింది. భవనపు పైఅంతస్తు వరకు చేరిన ఉడుము ఒకచోట ఆగిపోయింది.

తన చేతుల్లో వున్న తాడును బలంగా లాగిచూశాడు మణిదీపుడు. ఉడుము ఉడుంపట్టు పట్టిందని గ్రహించి చిన్నగా నవ్వుకుని, ఆలస్యం చెయ్యక ఆ తాడు పట్టుకుని భవంతి పైకి ఎక్కడం ప్రారంభించాడు.

దూరం నుంచి అతణ్ణి గమనించిన తిమ్మయ్య ఆవైపు భటులెవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నాడు.

సరిగ్గా అదే గడియలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది.

మేఘ ద్వారము నుంచి నాలుగు కొరివి దెయ్యాలు ఎగురుతూ వచ్చి, గవాక్షం నుంచి రాజకుమారి మందిరంలోకి ప్రవేశించాయి.

ఉడుము మీద దృష్టిని లగ్నం చేసిన మణిదీపుడి పక్కగా వెళ్లినా వాటిని అతడు గమనించలేదు.

ఆ కొరివి దెయ్యాలు తలలపై నిప్పుల కుంపట్లు పెట్టుకున్నట్టు, వాటి తలల పైనుంచి అగ్నిజ్వాలలు రేగుతున్నాయి. కోరపళ్లను బయటపెట్టిన ఆ

కొరివి దెయ్యాలు పరమ భయంకరంగా వున్నాయి.

మణిదీపుడి రాక కోసం ఎదురు చూస్తున్న చంద్రలేఖ మేలుకునే వున్నది. ఏదో చప్పుడు వినిపించేసరికి తలతిప్పి చూసింది. ఆ కొరివి దెయ్యాలు కనిపించేసరికి భయంతో అరచి, హంసతూలికాతల్పం మీద విరుచుకు పడింది.

ఆ నాలుగు కొరివి దెయ్యాలు కలసి మంచము నాలుగు కోళ్లని భుజాలకు ఎత్తుకున్నాయి.

చంద్రలేఖ అరుపులకు నిద్రలేచిన చెలికత్తెలు ఆ వింతను చూసి భయంతో వణికిపోయారు.

అప్పటికే మంచము మీద లేచి కూర్చున్న రాజకుమారి, "సంపంగీ, చామంతీ... ప్రియసఖులూ... నన్ను రక్షించండి..." అంటూ కేకలు పెడుతూనే వున్నది.

ఆ మంచము గవాక్షాన్ని దాటింది. అప్పుడు తన పక్కనుంచి వెళ్లిపోతున్న ఆ దృశ్యాన్ని చూశాడు మణిదీపుడు. వెంటనే తేరుకుని, "యువరాణీ... యువరాణీ..." అంటూ అరిచాడు. ఆ పిలుపు ఆమెకు వినిపించలేదు.

భవనం కింద కాపలా కాస్తున్న భటులు, సైనికులకు చంద్రలేఖ అరుపులు వినిపించి తలలు పైకెత్తి చూశారు. వాళ్లు కేకలు వేశారు. హాహాకారాలు చేశారు.

మంచము మీద లేచి నిలబడిన చంద్రలేఖ భయం వేసి కూర్చున్నది. కేకలు వెయ్యడం మాత్రం మానలేదు.

రాజకుమారి కేకలు, భటుల అరుపులు వినిపించిన కొంత మంది పుర ప్రజలు మేలుకుని గృహాల నుంచి బయటికి వచ్చారు. తమ కళ్లకి కనిపిస్తూ ఎగురుతున్న మంచాన్ని, దానిమీదున్న యువరాణిని, మంచమును మోసుకుపోతున్న కొరివి దెయ్యాలను చూసి భయాందోళనలతో గజగజా

వణికిపోయారు. పక్కింటి, ఎదురింటి తలుపులను కొట్టి వారికి కూడ ఆ దృశ్యాన్ని చూపించారు.

ధైర్యవంతుల మాటపెగిలింది. పిరికివాళ్లు గృహాలలోకి పోయి తలుపులు బిగించుకున్నారు.

“ఎన్నడూ కనీ వినీ ఎరుగని వింత?” అన్నాడు ఓ వృద్ధుడు.

“యువరాణికి ప్రమాదం అంటే ఏమో అనుకున్నాం గానీ, అది కొరివి దెయ్యాల రూపంలో వచ్చిందన్నమాట!” అన్నది పళ్లు వూడిపోయిన ఓ అవ్వ.

“ఆ దెయ్యాలు రాజకుమారిని ఎందుకు ఎత్తుకుపోతున్నాయి?” అని ఆ వృద్ధుణ్ణి ప్రశ్నించాడు ఓ యువకుడు.

“ఏమో! ఎవరికి తెలుసు? పాపం... మహారాజు, మహారాణి దు:ఖాన్ని ఎవరాపగలరు?” అంటూ జాలిపడ్డాడు వృద్ధుడు.

మంచము వెళుతున్న దిశగా భటులు, సైనికులు పరుగులు తీశారు. అది తమ కనుదృష్టి నుంచి దాటిపోయేసరికి చేసేదిలేక వెనుదిరిగి వచ్చారు.

భవనపు గోడ మీద వ్రేలాడుతున్న మణిదీపుడు చేతిపట్టును వదులు చేస్తూ కిందకి జారాడు. పరుగు పరుగున వెళ్లి తిమ్మయ్యను కలిశాడు. అప్పటికే సైనికుల ద్వారా ఆ వింతవార్త అతడికి చేరింది.

“నా కళ్లతో నేను చూశాను. ఆ కొరివి దెయ్యాలను అంత దగ్గరగా చూసినా నమ్మశక్యం కాలేదు. ఎంత భయంకరంగా వున్నాయవి... కోరపళ్లు, దుబ్బు జుట్టు గుంటలు పడిన కళ్లు, తలమీద నిప్పుకుండలో నుంచి వస్తున్నట్టు అగ్నిశిఖ... తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నది...” అంటూ వర్ణించి చెప్పాడు మణిదీపుడు.

“ఇంక నీ వర్ణన ఆపవయ్యా నాయనా... నాకు అసలే దెయ్యాలంటే

భయం!" అన్నాడు తిమ్మయ్య వణికిపోతూ.

"గొప్ప వీరుడివి... మా బోటి వారికి నాయకుడివి... నీకు దెయ్యాలంటే భయమా?"

"దెప్పిపొడిచింది చాలుగానీ... ఇక ఆపవయ్యా ఆపు. ఇప్పుడు నేను చెప్పేది బాగా జ్ఞాపకం పెట్టుకో... నిన్ను పంపించమని యువరాణి నాకు చెప్పలేదు. నువ్వు భవంతి గోడమీదకి ఎగ్రబ్రాకలేదు. ఈ రహస్య విషయాలు బయటికి వచ్చాయంటే మన ఇద్దరి తలలు కోటగుమ్మానికి వేలాడతాయి. మన మొండెములు కందకంతో మొసళ్లకు ఆహారంగా పడతాయి. ఆ తర్వాత మంత్రాలు, చింతకాయలు ప్రయోగించినా మనం బ్రతకడం కల్ల! ఈ విషయం ఇంతటితో మరిచిపో... తెలిసిందా?" అంటూ గుచ్చి గుచ్చి చూశాడు తిమ్మయ్య.

మణిదీపుడు మౌనంగా తల వూపాడు. విగడియ తర్వాత అతడి ముఖం గంభీరంగా మారిపోయింది. "ఏది ఏమైనా సరే... నా ప్రాణాలు వొడ్డి యువరాణిని కాపాడతాను..." అంటూ దృఢస్వరంతో పలికాడు.

❖ ❖ ❖

ఎక్కడ చూసినా ఇదే వింత వార్తను ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. రాత్రి ఆ కొరివి దెయ్యాలను చూసినవారికి ఇక నిద్ర పట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూశారు. పురవీథుల్లో, నగర కూడళ్లలో చేరి ఆ విచిత్రాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు. దారిన పోతున్న జనం ఆగి మరీ వింటున్నారు.

"ఇది మానవమాత్రుల వల్ల అయ్యే పనికాదు. క్షుద్రవిద్యలు తెలిసిన ఏ మహామాంత్రికులో, రాకాసి మూకలో ఇలాంటి పనులు చేయగలరు. ఇంతకీ యువరాణి కర్మ ఎలా వున్నదో? మన రాజ్యానికి ఏదో పీడ పట్టింది..." అంటూ

జాలిగా అన్నాడు ఓ పండుముదుసలి.

సరిగ్గా  అప్పుడే ఆ వీధిలోకి పదిమంది భటులు గుంపుగా వచ్చారు. అక్కడున్న ఓ వటవృక్షం కింద వున్న రాతిబండ మీదకు ఎక్కి నిలిచారు ఇద్దరు సైనికులు. ఒక సైనికుడు తన చేతిలో వున్న డప్పును మోగించి ఆపాడు.

పురప్రజలంతా చేస్తున్న పనులు పక్కన పెట్టి అక్కడ చేరారు.

రెండవ సైనికుడు తన చేతుల్లో వున్న రాజ ఉత్తర్వును విప్పి పట్టుకుని, "ఇందు మూలముగా యావన్మంది ప్రజానీకానికి మన ప్రభువులు తెలియజేస్తున్న విన్నపము ఏమనగా... యువరాణి చంద్రలేఖను గత రాత్రి ఏదో దుష్టశక్తి ఎత్తుకుపోయింది. కనుక, రాజకుమార్తెను రక్షించి క్షేమంగా తీసుకొచ్చినవారికి అర్ధరాజ్యం ఇవ్వబడుతుంది. వీరులైన యువకులు ముందుకువచ్చి తమ రాజభక్తిని చాటుకోమని మహారాజు శ్రీశ్రీశ్రీ కీర్తిసేనులవారు తెలియజేస్తున్న విన్నపములివియే..." అంటూ ప్రకటన చేశాడు.

ఆ ప్రకటన వెలువడక ముందే రాజభవనానికి చేరారు గురుశిష్యులు తిమ్మయ్య, మణిదీపుడు. దు:ఖ సముద్రంలో వున్న రాజదంపతులను చూసి బాధపడ్డారు.

"మన్నించండి ప్రభూ! ఇంతమందిమి వుండి కూడ యువరాణిని రక్షించలేకపోయాము..." అన్నాడు తిమ్మయ్య.

"ఆకాశమార్గాన ఎత్తుకుపోయిన దుష్టశక్తులను ఎవరాపగలరు తిమ్మయ్యా... నీ ప్రభుభక్తి మాకు తెలియనిది కాదు" అన్నాడు కీర్తిసేనుడు.

"అంతటితో మాకు తృప్తిలేదు ప్రభూ! యువరాణిని రక్షించడానికి మేమిద్దరం బయలుదేరుతున్నాం... మీ ఆజ్ఞకోసం, ఆశీర్వాదం కోసం వచ్చాము."

తిమ్మయ్య మాటలు వింటూ మణిదీపుణ్ణి పరిశీలనగా చూశాడు కీర్తిసేనుడు. “గవాక్షం నుంచి పడబోయిన చంద్రలేఖను రక్షించింది ఈ యువకుడే కదూ!”

“అవును మహారాజా!”

“క్షేమంగా వెళ్లి రండి నాయనా! మా కన్నబిడ్డను కళ్లజూడగలిగితే మా జన్మ ధన్యమైనట్లే...” అంటూ వారిని ఆశీర్వదించి, వారి ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేయించాడు కీర్తిసేనుడు.

❖ ❖ ❖

రెండు కాలాశ్వాల మీద మెరుపు వేగంతో ప్రయాణిస్తున్నారు గురుశిష్యులు. మేలు జాతి అశ్వాలు కావడం వల్ల త్వరగా అలసిపోకుండా ఒడుపుగా పరుగులు తీస్తున్నాయా గుర్రాలు. కొరివి దెయ్యాలు ఉత్తర దిశగా వెళ్లాయని తెలియడం వల్ల వారి పయనం అటువైపే సాగుతున్నది.

పల్లెలు, గ్రామాలు, కొండలు, గుట్టలు వెనుకబడిపోతున్నాయి. వాతావరణం అనుకూలంగా, ఆహ్లాదకరంగా వున్నది.

మధ్యాహ్న సమయానికి ఒక చెట్లతోపును సమీపించి, ఓ వృక్షం క్రింద కాసేపు విశ్రమించారు వాళ్లు.

తిమ్మయ్య అక్కయ్య కాంతం కట్టి ఇచ్చిన దిబ్బరొట్టె తిని, దరిదాపున వున్న కొలనులోకి దిగి దాహం తీర్చుకున్నారు. తిరిగి అశ్వాలను అధిరోహించి ఆగమేఘాల మీద పరుగులు తీయించారా గురుశిష్యులు.

కనుచీకట్లు ముసురుకుంటున్న వేళకు ఓ అరణ్య మార్గాన్ని పట్టారు వాళ్లు. ఆ రాత్రివేళ ముందుకు వెళ్లడం ప్రమాదమని దట్టంగా వృక్షాలు వున్నచోట గుర్రాలను నిలిపి, వాటికి మేత పెట్టారు.

ఓ పెద్ద చెట్టు ఎక్కి, విశాలమైన కొమ్మల మీద విశ్రాంతి తీసుకున్నారు. ఉదయమే లేచి, ఆ సమీపాన కనిపించిన సెలయేరు వద్ద కాలకృత్యాలు తీర్చుకుని తమ వద్ద మిగిలిపోయిన రొట్టెముక్కను, కొన్ని చెట్ల ఫలాలను తిని ఆకలి తీర్చుకున్నారు.

“మా కాంతం అక్క వండి వారుస్తుంటే కమ్మని భోజనం, తేనె తొనలను తినే యోగం లేదు... ఏం చేస్తాం!” అన్నాడు తిమ్మయ్య నిరాశగా.

అతడి మాటలకు పకపకా నవ్వాడు మణిదీపుడు. “మనకు మంచి రోజులొస్తాయి. బాధపడకు తిమ్మయ్యా!” అన్నాడు.

“గురువుగా నన్ను గౌరవించి పిలిచేవాడివి. ఏకవచనంలోకి వచ్చేశావా నాయనా!” అని ఆశ్చర్యంగా చూశాడు తిమ్మయ్య.

“గురుశిష్యుల సంబంధం రాజ కొలువులో వున్నప్పుడు... ఇప్పుడు కొలువు దాటి వచ్చేశాము. నువ్వు, నేను సమానమే! పైగా నీ బోడి తలకు భయపడి, నేను రాజాజ్ఞను ధిక్కరించి భవనపు గోడ ఎక్కేలా చేశావు. అందువల్ల నీ మీద నాకు గౌరవం తగ్గింది...” నాటకీయంగా చెప్పి నవ్వాడు మణిదీపుడు.

ముక్కు మీద వేలేసుకున్నాడు తిమ్మయ్య. “సరే నాయనా! నీకెలా పిలవాలనిపిస్తే అలా పిలువు. నీ ముందు తల వంచవలసిన పరిస్థితి వచ్చింది... ఏం చేస్తాం!”

తిరిగి మారుమాట లేకుండా ప్రయాణమయ్యారు వాళ్లు.

ఆ అడవి దాటిన తర్వాత వారికి కొందరు బాటసారులు ఎదురు పడ్డారు.

కళ్లాలు పట్టి లాగి గుర్రాలను వారి ముందు నిలిపారు ఆ ఇద్దరూ.

“అయ్యా... ఈ దారి ఎటు పోతుంది? ఇక్కడికి సమీపంలో ఏదైనా సత్రము వున్నదా?” అని ఆ బాటసారులను ప్రశ్నించాడు మణిదీపుడు.

రైతులా వున్న ఓ బాటసారి ముందుకు వచ్చి, “ఈ మార్గం వెంబడి పోతే రత్నగిరి రాజ్యం వస్తుంది నాయనా! ఇక్కడికి సమీపంలో సత్రము ఏదీలేదు... నాలుగు గడియలు మీరు ఆగకుండా ప్రయాణిస్తే పూటకూళ్ల అవ్వ ఇంటికి చేరుకోగలరు. అవ్వ ఇంట భోజనం చెయ్యవలసిందే... అమృతోపమానంగా వండి పెడుతుంది!” అంటూ చెప్పాడు.

ఆ రైతు మాటలు పూర్తి కాకముందే తన అశ్వాన్ని అటు పరుగులు తీయించాడు తిమ్మయ్య.

చిన్నగా నవ్వి, ఆ రైతుకు కృతజ్ఞతలు చెప్పి తన గుర్రాన్ని అదిలించాడు మణిదీపుడు.

❖ ❖ ❖

రైతు చెప్పినట్టు నాలుగు గడియల్లోనే పూటకూళ్ల అవ్వ ఇంటికి చేరుకున్నారు తిమ్మయ్య, మణిదీపుడు.

అవ్వ వారిని సాదరంగా ఆహ్వానించింది.

అప్పటికే తిమ్మయ్య ఆకలితో నకనకలాడుతున్నాడు.

“ఇప్పుడే వంట పూర్తి అయింది. భోజనానికి లేస్తే వడ్డిస్తాను నాయనలారా!” అన్నది అవ్వ.

“వడ్డించు అవ్వా...” అంటూ గబగబా వెళ్లి అరిటాకు ముందు కూర్చున్నాడు తిమ్మయ్య.

ఆ అవ్వ ఇద్దరికీ వేడి వేడి అన్నం, కూరలు వడ్డించింది. వాళ్లు తృప్తిగా భోజనం చేశారు. చేతులు కడుక్కుని వచ్చి వీధి అరుగు మీద కూర్చున్నారు.

ఇంకా కొందరు బాటసారులు వచ్చి భోజనం చేసి వెళ్లిపోయారు. అవ్వ వంటగదిలో పని ముగించుకుని వచ్చి, అరుగు మీద వారి ఎదురుగా కూర్చుంది.

"పెద్దమ్మా... బాటసారులు చెబితే ఏమో అనుకున్నాం గాని నువ్వు పెట్టిన భోజనం అమృతంతో సమానం" అన్నాడు మణిదీపుడు.

"వంటలో మా అక్కను మరిపించావు తల్లీ... పోతున్న ప్రాణాలను వెనక్కి తెచ్చావు!" అంటూ చేతులెత్తి అవ్వకు నమస్కరించాడు తిమ్మయ్య.

"మీలాంటివారికి వండి పెట్టడంలో నాకు కాస్తో కూస్తో పుణ్యం దక్కుతున్నది నాయనా!" అంది అవ్వ.

అప్పటికే చీకటి పడింది.

అవ్వ లేచి వెళ్లి చమురు దీపాన్ని తెచ్చి గూటిలో పెట్టింది. తిరిగి కూర్చుంటూ వారి సమాచారం అడిగింది.

తిమ్మయ్య జరిగింది జరిగినట్టు పూసగుచ్చినట్టు అవ్వకు చెప్పాడు. ఆవిడ అంతా విన్న తర్వాత, "అవును నాయనా! ఒకనాటి రాత్రి నేను ఆరుబయట మంచం వేసుకుని పడుకున్నాను. మంచి నిద్దట్లో వుండగా వంటగదిలో ఎలుకలు చేస్తున్న చప్పుడుకి మెలుకువ వచ్చి కూర్చున్నాను. తలపైన ఏదో వెలుగు నీడ మెరుపులా కనిపించేసరికి తల పైకెత్తి చూద్దును గదా... నాలుగు కొరివి దెయ్యాలు పెద్ద మంచాన్ని మోసుకుంటూ పోవడం కనిపించింది. వాటి తలల మీద నిప్పు కుంపట్లు వున్నట్లు మంటలు చెలరేగుతున్నాయి" అంటూ చెప్పింది.

"సందేహం లేదు పెద్దమ్మా... ఆ మంచం మీద యువరాణి వుంది."

"కాస్త ఎత్తులో వుండటం వల్ల ఆ మంచం మీద ఎవరూ నా దృష్టికి కనిపించలేదు నాయనా!"

"ఆ మంచం ఎటువైపు వెళ్లింది?" ప్రశ్నించాడు తిమ్మయ్య.

"ఇక్కడి నుంచి వాయువ్య దిశగా వెళ్లింది..." అంటూ చేయెత్తి చూపించింది.

"పెద్దమ్మా... మాకు మార్గం చూపించినందుకు కృతజ్ఞతలు. తెల్లవారక ముందే వెళతాము..." అంటూ అవ్వ చేతిలో కొన్ని బంగారు కాసులు పెట్టాడు మణిదీపుడు.

"యువరాణిని క్షేమంగా తీసుకురండి నాయనా..." అని వారిని ఆశీర్వదించింది ఆ పూటకూళ్ల అవ్వ.

❖ ❖ ❖

తిమ్మయ్య, మణిదీపుడి గుర్రాలు మెరుపు వేగంతో పరుగులు తీస్తున్నాయి. ఏకబిగిన ప్రయాణం సాగించారు. మధ్యలో ఒకచోట అశ్వాలకు మేత పెట్టి, అవ్వ కట్టి ఇచ్చిన రొట్టెను తిని, విశ్రాంతి తీసుకోకుండా పయనం సాగించారు.

సాయంత్రం వేళకు ఓ దుర్గమారణ్యంలోకి ప్రవేశించారు. అల్లిబిల్లిగా అల్లుకున్న చెట్ల మధ్యనుంచి మలుపులు తిరిగిన బాటలో గుర్రాలను మెల్లగా నడిపించారు. పచ్చని చెట్లతో, సెలయేటి ప్రవాహంతో, పూపొదలతో, పరుగులు తీస్తున్న జంతుజాలంతో ఆ అడవి చాలా అందంగా వున్నది.

"తేనెతిండి తిని ఎన్నో రోజులు అయినట్టు వున్నది మణిదీపా!" ఆశగా అన్నాడు తిమ్మయ్య.

అదే గడియలో ఓ మహావృక్షం చిటారుకొమ్మన మణిదీపుడికి తేనెపట్టు కనిపించింది. "నీ కోరిక తీరేనులే... అటు చూడు" అంటూ చూపించాడు.

తేనెపట్టును చూసి తిమ్మయ్య నోరు వూరింది. లొట్టలు వేశాడు.

మణిదీపుడు నవ్వి, "ఇక్కడే వుండు... పని పూర్తి చేసుకుని వస్తాను" అంటూ చకచకా ఆ మహావృక్షాన్ని ఎక్కాడు. అలవాటైన విద్య కనుక వేగంగా చిటారు కొమ్మకు చేరుకున్నాడు. ఎండిన ఓ కొమ్మను విరిచి, దాంతో తేనెపట్టును కింద పడగొట్టాడు.

సంతోషంగా తల పంకించిన మణిదీపుడికి కనుచూపు దూరంలో ఓ శిథిల భవనం కనిపించేసరికి అతడి భృకుటి ముడిపడింది.

సరిగ్గా అప్పుడే అతడి దృష్టి పథంలోకి మరో దృశ్యం వచ్చింది. నాలుగు కొరివిదెయ్యాలు ఎగురుతూ వచ్చి, ఆ భవనం మీద వాలాయి. తర్వాత అవి కనిపించలేదు.

మణిదీపుడు గబగబా చెట్టు దిగి వచ్చాడు. “తిమ్మయ్యా... యువరాణి ఎక్కడుందో తెలిసిపోయింది!” అన్నాడు ఆనందంగా.

“భళిరా భళి... ఎలా తెలిసింది?” ఉత్సాహంగా అడిగాడు.

చెట్టుపైనుంచి కొరివి దెయ్యాలను చూసిన విషయం చెప్పాడు అతడు. దెయ్యాల మాట వినగానే తిమ్మయ్యకు వణుకు పుట్టింది. “కత్తులు తిప్పేవాళ్లతో ఎంత సేపైనా పోరాడవచ్చు. కాని భూత ప్రేతాలతో నేను దెబ్బలాడలేను...” అన్నాడు.

“నాకు భయంలేదు. వాటితో నేను పోరాడతాను. ఆ సమయంలో యువరాణికి రక్షణగా నిలబడు చాలు!” అని చెప్పాడు మణిదీపుడు.

“ఓ... అదెంత పని!”

“కానీ దెయ్యాల కంట పడకుండా మనం యువరాణిని కనుక్కోగలిగితే, కొన్ని జాగ్రత్తలను ఆమె మనకి చెప్పగలుగుతుంది. ఎందుకంటే, మనకి మంత్రాలు రావుగా!”

“నువ్వన్నదీ నిజమే... అలాగే చేద్దాం. ఈ గడియ నుంచి నువ్వు గురువు, నేను శిష్యుణ్ణి” అన్నాడు తిమ్మయ్య.

కింద పడిన తేనె పట్టును వదిలి తేనెటీగలు ఎగిరిపోయాయి. దాన్ని శుభ్రం చేసి, ఓ ఆకు దొప్పలోకి తేనె పిండాడు మణిదీపుడు.

తన వద్ద మిగిలిన రొట్టెను సగం విరిచి అతడికి ఇచ్చాడు తిమ్మయ్య. ఆ ఇద్దరూ అలా భోజనం ముగించి, సెలయేటిలో నీళ్లు తాగారు.

గుర్రాలను అక్కడే విడిచిపెట్టి ఆ దుర్గమారణ్యంలోకి కాలినడకన బయలుదేరారు ఆ వీరులు.

❖ ❖ ❖

"ఇంతకీ యువరాణి నిన్ను రహస్యంగా కలసి మాట్లాడాలనుకున్న విషయం ఏమై వుంటుంది మణిదీపా?" తేనెతుట్టెలో కందిరీగలా ఆ ప్రశ్న తొలుస్తూ వుండేసరికి సందిగ్ధంగా అడిగాడు.

"ఏమో! రాజకుమారి మనసులో దోబూచులాడుతున్న విషయం ఏమిటో మనకెలా తెలుస్తుంది?"

"పోనీ, నీ మనసులో ఏముంది?"

"ఏ విషయం గురించి?"

"యువరాణి విషయం..."

"ఆమె గొప్ప అందగత్తె. సౌశీల్యవతి. అంతకంటే ఇంకేమి చెప్పాలి?"

"ఇంకేమీ చెప్పొద్దు. ఎవరివో కేకలు వినిపిస్తున్నాయి. అదేమిటో విను..." అని తిమ్మయ్య చెప్పగానే కేకలు వినవస్తున్న వైపు పరుగు తీశాడు మణిదీపుడు. అతణ్ణి అనుసరించాడు తిమ్మయ్య.

"వీర యువకుడా, నన్ను రక్షించు... ఈ బాధ నుంచి విముక్తి కలిగించి పుణ్యం కట్టుకో..." అంటూ కేకలు వినిపించాయి.

ఒక చెట్లతోపులోకి ప్రవేశించిన మణిదీపుడు అక్కడి దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు.

ఒక చెట్టు మొదలులో నుంచి ఓ మహాపురుషుడి తల బయటకు పొడుచుకు వచ్చింది. అది ఎలా వుందంటే, వధ్యశిల మీద తల ఆన్చినట్టు వున్నది.

"మహాశయా... తమరెవరు? ఏమిటి మీకీ దుస్థితి?" అని ప్రశ్నించాడు మణిదీపుడు. అప్పుడే అక్కడికొచ్చిన తిమ్మయ్య వారి మాటలు వినసాగాడు.

"నాయనా! నేనొక గంధర్వుణ్ణి... నా పేరు సువర్ణముఖుడు. గంధర్వ లోకాన్ని పరిపాలించాలనే దురాశతో, అర్హత లేకపోయినా గర్వాంధకారంతో గంధర్వరాజును ఎదిరించాను. తత్ఫలితంగా శాపవశాన ఇక్కడకొచ్చి పడ్డాను. ఇది నరమాంసభక్షకి వృక్షం. నా నవనాడుల నుంచి శక్తిని లాక్కుని ఇది బ్రతుకుతున్నది. నాకు ప్రత్యక్షనరకం చూపిస్తున్నది. ఈ మార్గాన పోతున్న బాటసారుల సవ్వడి విని, కేకలు వేసి పిలుస్తున్నాను. నా కేకలు విని కొందరు భయంతో పారిపోతున్నారు. మరి కొందరు దగ్గరకు వచ్చి నా కథవిని, నాకు సహాయం చేసే సాహసం చేయ్యలేక పారిపోతున్నారు. కనీసం నీవైనా నాకు సహాయం చేస్తావా నాయనా?" అంటూ దీనంగా అడిగాడు ఆ గంధర్వుడు.

"నేను ఏం చెయ్యాలో సెలవివ్వండి మహాశయా... నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను."

"నీ ఖడ్గంతో నా తలను ఒక్క వ్రేటుతో నరకాలి. కానీ తల నరికే సమయంలో అజాగ్రత్తగా వున్నావంటే ఈ వృక్షపు వేరులు వేగంగా వచ్చి నిన్ను లోపలికి లాక్కుంటాయి. ప్రమాదం పొంచి వున్నది."

"మనిషికి ఎప్పుడైనా ఒక్కసారే చావు వస్తుంది. మీకు ఉపకారం చేయడంలో నా ప్రాణం పోయినా బాధలేదు!" అంటూ ఒరలోంచి ఖడ్గం తీశాడు మణిదీపుడు.

ఏం జరుగుతుందోనని తిమ్మయ్య ఆతృతగా చూస్తున్నాడు.

అతడు ఖడ్గాన్ని గురి చూస్తూ వుండగానే ఆ వృక్షం క్రింద నుంచి పిల్ల వేరులు కత్తుల్లా పొడుచుకొచ్చి మణిదీపుణ్ణి చుట్టేయాలని చూశాయి. కనుచివర్ల నుంచి వాటి కదలికను గమనించిన అతడు ఖడ్గాన్ని ఆ వేరుల వైపు విసిరాడు. అవి తెగిపోయి, వాటినుంచి రక్తం స్రవించసాగింది. చెట్టు నుంచి కేక వెలువడింది.

మరోసారి స్వర్ణముఖుడి తలపై వేటు వేస్తున్నట్టు నటిస్తూ కత్తిని దించాడు మణిదీపుడు. మరోవైపు నుంచి చాటుగా వచ్చిన వేరులు తెగి పడ్డాయి. రక్తం వరదలై పారింది. చెట్టు నుంచి మళ్లీ ఆర్తనాదం వినిపించింది.

చెట్టు వేరులు బలహీనపడేసరికి స్వర్ణముఖుడికి నరకబాధ తప్పింది. "నాయనా! ఇదే సమయం... నా తల ఖండించు" అన్నాడు గంధర్వుడు.

ఖడ్గాన్ని పైకెత్తి ఒక్క వ్రేటుతో స్వర్ణముఖుడి తలను ఖండించాడు మణిదీపుడు.

కనురెప్పపాటులో ఆ వృక్షం భస్మమైపోయింది. బంగారు కాంతులతో స్వర్ణముఖుడు ప్రత్యక్షమయ్యాడు. "నాయనా! నేటికి నీ పుణ్యవశాన నాకు శాపవిమోచనం జరిగింది..." అంటూ తన వద్ద వున్న ఓ దివ్య ఖడ్గాన్ని మణిదీపుడికి అందించాడు.

"ఇది అపూర్వమైన ఖడ్గం... ఇది నీ చెంత వున్నంతవరకు భూత ప్రేత పిశాచాలు నీదరికి రావు. నేను నా లోకానికి వెళ్లిపోతున్నాను... మనోభీష్ట సిద్ధిరస్తు..." అని అతణ్ణి దీవించి స్వర్ణముఖుడు అదృశ్యమైపోయాడు.

"ఇది చాలా అన్యాయం... నీ వెనక వున్న నాకు కూడ ఏ ఖడ్గమో, కిరీటమో ఇవ్వకుండా పోయాడా గంధర్వుడు" అన్నాడు తిమ్మయ్య కోపం

నటిస్తూ.

"ఎవరివద్ద వున్నా ఒకటేలే... నీ వద్దనే వుంచు..." అంటూ ఆ దివ్య ఖడ్గాన్ని అతడికి ఇవ్వబోయాడు మణిదీపుడు.

"వద్దులే... దెయ్యాలు ఎదురుపడితే భయంతో దీన్ని కింద పడెయ్యగల సమర్థుణ్ణి. నీ వెనక వుంటాను కనుక నాకు రక్షణ వున్నట్టే!" అని తిమ్మయ్య వెనకడుగు వేసేసరికి అతడు పకపకా నవ్వాడు.

ఇద్దరూ ముందుకు నడిచారు.

నాలుగు గడియల తర్వాత శిథిల భవనాన్ని సమీపించారు వాళ్లు.

అప్పటికే చీకట్లు దట్టంగా ఆ దండకారణ్యాన్ని అలుముకున్నాయి.

తిమ్మయ్య వణుకుతూ బెదిరిపోవడం చూసి, "ఏం జరిగింది?" అన్నాడు మణిదీపుడు.

చూపుడు వేలుతో ఓవైపు చూపించాడు అతడు.

తలలు లేని మొండెములు ఆ శిథిల భవనం చుట్టూ తిరుగుతున్నాయి. ఆ మొండెముల తాలూకు తలలు గాలిలో తేలుతూ, వాటిని వెంబడిస్తున్నాయి. అందులో ఒక తలను గుర్తుపట్టాడు తిమ్మయ్య. "అతడు నికుంభ మహారాజు పుత్రుడు సూర్యవర్మ. మన యువరాణి రక్షణ కోసం నిర్మించిన భవనాన్ని చూడటానికి వచ్చాడు. అప్పుడతణ్ణి నేను పలకరించాను" అంటూ కళ్లు తేలేసినట్టు చూశాడు.

"ఏదో దుష్టశక్తి వారికి తాత్కాలికంగా జీవం పోసి, మంత్ర బద్ధుల్ని చేసి నడిపిస్తున్నది. అదిగో... అక్కడ సింహద్వారం వున్నది. ద్వారంలోనే కత్తుల బోను కూడ వున్నది. లోపలికి వెళ్లినవారి పరిస్థితి అంతే! తలలు తెగి, ఆ వీర యువకుల్లా భవనం చుట్టూ తిరుగుతూ వుంటారు. భయభ్రాంతులను చేసి

ప్రాణాలను హరించే ఆ దుష్టశక్తి ఏమిటో తెలుసుకోవాలి...” అన్నాడు మణిదీపుడు.

“బాబోయ్ నేను లోపలకు రాను...”

“భయంలేదు, నా వెనుక వెంబడించు...” అంటూ సింహద్వారం వద్ద వున్న కత్తుల బోనులోకి చూశాడు మణిదీపుడు.

లోపలికి ప్రవేశించేవారి తలలు త్రుంచడానికి సిద్ధంగా వున్నాయి కత్తులు.

గంధర్వుడు ఇచ్చిన ఖడ్గాన్ని రెండు చేతులతో బిగించి పట్టుకుని, కత్తిని వేగంగా తిప్పుతూ లోనికి ప్రవేశించాడు మణిదీపుడు.

అతడి వేగానికి కత్తుల బోను తుత్తునియలుగా ముక్కలైపోయింది. సువర్ణ ముఖుడు ఇచ్చిన ఖడ్గ మహిమ తిమ్మయ్యకు తెలిసివచ్చింది.

“ఈ ఖడ్గం నీ వద్ద వుంచుకో... భూతప్రేతాలు నీ జోలికి రావు” అంటూ ఆ కత్తిని తిమ్మయ్యకు అందించాడు అతడు.

లోపల అంతటా పరమ భయంకరంగా వుంది. ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా మానవ కళేబరాలు, కంకాళాలు కనిపిస్తున్నాయి.

ఆ దుర్వాసన భరించలేక మరో మందిరంలోకి అడుగుపెట్టారు వాళ్లు.

కొండగుహలా వున్న అక్కడ దుర్వాసన లేదు. కానీ భీకరాకారాలతో నాలుకలు చాచుకుని నిలువెత్తు రాకాసి విగ్రహాలు నాలుగు మూలల్లోను నిలబెట్టి వున్నాయి.

తిమ్మయ్య భుజం తట్టి ధైర్యం చెప్పాడు మణిదీపుడు.

అదే గడియలో నాలుగు కొరివి దెయ్యాలు ఎగురుతూ వచ్చి వారి ముందు నిలిచాయి.

“తిమ్మయ్యా, భయపడకు. నీ చేతిలో వున్నది దివ్య ఖడ్గం. దాన్ని వాటి

మీద ప్రయోగించు...” అనగానే ముందుకొచ్చి ఆ దెయ్యాల మీద ఖడ్గం ఝుళిపించాడు అతడు.

తలల మీద వున్న కుంపటి సెగలతో వారిని భస్మం చేయాలని వచ్చిన ఆ కొరివి దెయ్యాలు లబలబలాడుతూ చిత్రంగా కేకలు వేసి మాయమైపోయాయి.

తిమ్మయ్య ముఖం వెయ్యి కాంతులతో వెలిగిపోయింది.

“సందేహం లేదు. యువరాణి ఈ భవనంలోనే ఎక్కడో వుంది” అంటూ ముందుకు పరుగుతీసి మరో మందిరంలోకి ప్రవేశించాడు మణిదీపుడు. అతడి పక్కనుండి జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు తిమ్మయ్య.

ఓ వైపు నుంచి అకస్మాత్తుగా వారి ముందుకు వచ్చి నిలిచాయి కొన్ని భూతాలు. తిమ్మయ్య చేతిలో వున్న దివ్య ఖడ్గాన్ని చూసి భీకరంగా అరుస్తూ పారిపోయాయి.

మరికొన్ని మందిరాలు తిరిగిన తర్వాత అంతర్భాగంలో వున్న ఓ భవంతిలో వారికి కనిపించింది యువరాణి చంద్రలేఖ.

తిమ్మయ్యను గుర్తుపట్టి ఆమె పరుగున వచ్చింది. “తిమ్మయ్యా... తిమ్మయ్యా...” అంటూ.

“భయపడకమ్మా... ఇంకేమీ భయం లేదు. మిమ్మల్ని రక్షించడానికి మేము వచ్చేశాము కదా!” అన్నాడు అతడు గొప్ప ధైర్యవంతుడిలా.

తిమ్మయ్య వెనుక వున్న మణిదీపుణ్ణి ఆనందాశ్చర్యాలతో చూసింది. ఆ భవనం మిగతా మందిరాలకు భిన్నంగా వున్నది. యువరాణుల అంత:పురంలా అందంగా వున్నది.

చంద్రలేఖ వెనుక చాలామంది యువతులు బిలబిలమంటూ అక్కడికి వచ్చారు.

"ఈ కన్నెలంతా ఎవరు యువరాణీ..." అని అడిగాడు మణిదీపుడు.

"వివిధ దేశాల రాకుమార్తెలు. వీరంతా నాలాగే బందీలు..."

"అసలు ఈ శిథిల భవనం కథ ఏమిటి?" అని ప్రశ్నించాడు తిమ్మయ్య.

"కంకాళ కామిని అనే ఒక బ్రహ్మరాక్షసి ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకున్నది. దేశదేశాల్లోని రాకుమార్తెలను తెచ్చి ఇక్కడ వుంచుతున్నది. వారికి కావలసినవన్నీ ఏర్పాటు చేస్తుంది. మా అందరినీ చూసి ముచ్చటతీరా చూస్తుంది. ఆమె మాట కాదని ఈ భవనం దాటి వెళితే మాత్రం, వారిని చంపి గుటుక్కున మింగుతుంది. రాజకుమార్తెల కోసం వచ్చిన వీర యువకులు కత్తుల బోనుకు బలైపోతున్నారు. తనకు ఎదురుపడినవాళ్లని అక్కడికక్కడే చంపి తినేస్తున్నది. ఇప్పటికి కొన్ని వందల మంది వీర యువకులు ఆ బ్రహ్మరాక్షసికి ఆహారమైపోయారు. మీరు దాటుకుంటూ వచ్చినవి వారి కళేబరాలే..." అంటూ తనకు తెలిసిన విషయాలు చెప్పింది చంద్రలేఖ.

"ఇతర రాజ్యాల యువరాణుల అదృశ్య వార్తలేవీ మనకు చేరలేదు" అన్నాడు తిమ్మయ్య.

సరిగ్గా అదే గడియలో వికటాట్టహాసం చేస్తూ వచ్చిన బ్రహ్మరాక్షసి భీకరమైన అరుపు వినిపించింది.

"అదిగో... వచ్చేసింది. ఆ రాక్షసి వచ్చేసింది. పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి" అంటూ భయంగా చూసింది చంద్రలేఖ.

"రానివ్వు యువరాణీ... ఆ రాక్షసి అంతు చూసిగానీ వోదలచుకోలేదు" అన్నాడు మణిదీపుడు.

"మిమ్మల్ని బ్రతకనివ్వదు..."

"అదీ చూద్దాం..." అంటూ ధీమాగా నిలబడ్డాడు మణిదీపుడు.

భయం నిలువెల్లా వణికిస్తున్నా తిన్నగా నిలబడటానికి ప్రయత్నిస్తున్నాడు తిమ్మయ్య.

"నరవాసన... నరవాసన..." అంటూ ఆ భవనంలోకి ప్రవేశించింది బ్రహ్మరాక్షసి. భవనపు పైభాగం తలకు తగిలేంత ఎత్తున వున్నదా రాకాసి.

చంద్రలేఖతో పాటు అక్కడ బందీలైన యువరాణులంతా భయం భయంగా చూస్తున్నారు.

ఆ ఇద్దరినీ గుడ్లు మిటకరించి చూసిందా బ్రహ్మరాక్షసి. "నరాధముల్లారా... ఎవరురా మీరు? నా కోటలోకి ప్రవేశించడానికి మీకెంత ధైర్యం!" అంటూ భీకరంగా అరిచింది. దాని అరుపు ఆ మందిరంలో ప్రతిధ్వనించింది.

"మన్నించు రాక్షసరాణీ... ఇది నీ కోట అని తెలియక వచ్చాము" అన్నాడు మణిదీపుడు.

"తెలిసి వచ్చినా, తెలియక వచ్చినా శిక్ష తప్పదు. మీ ఇద్దరినీ గుటుక్కుమని మింగేస్తాను" అన్నది బ్రహ్మరాక్షసి హూంకరిస్తూ.

"ధర్మం తెలియక మాట్లాడుతున్నావు. ఇంటికి వచ్చినవారు అతిథులతో సమానం... మేము నీకు అతిథులము. మాకు భక్ష్యాలు పెట్టాలి గానీ నువ్వు మమ్మల్ని భోంచేయకూడదు" అంటూ చిన్నగా నవ్వాడు మణిదీపుడు.

"నరాధమా... అధిక ప్రసంగీ... ఆపు నీ ధర్మపన్నాలు. నేను చేసిందే ధర్మం. నేను చెప్పేదే న్యాయం..."

"ధర్మం, న్యాయం అంటూ బీరాలు పలుకుతున్నావు. నన్ను ఎదిరించే ధైర్యం నీకు లేదు. దొంగ చాటుగా యువరాణులను ఎత్తుకురావడం ధైర్యవంతుల లక్షణం అనుకుంటున్నావా? వీరులైన రాకుమారులను మంత్రబలంతో కత్తులకు బలి చేయడం వీరత్వం అనుకుంటున్నావా? నువ్వు మహా పిరికిదానివి!" అంటూ

పగలబడి నవ్వాడు మణిదీపుడు.

"అవును. పిరికి సన్నాసివి..." అంటూ విరగబడి నవ్వాడు తిమ్మయ్య.

ఆ భవనం దద్దరిల్లేలా అరిచింది ఆ బ్రహ్మరాక్షసి. నేను పిరికిదాన్ని కాదు. గొప్ప ధైర్యవంతురాలిని!" అంటూ వికటాట్టహాసం చేసింది.

"అయితే నాతో ధర్మయుద్ధం చేసి గెలువు. అప్పుడు నువ్వు ధైర్యవంతురాలివని మేమంతా నమ్ముతాము"

ఏకకంఠంతో వారికి వత్తాసు పలుకుతూ, "అవును..." అంటూ యువరాణులంతా తలలు వూపారు.

"అయితే సరే... నేను ఏం చెయ్యాలో చెప్పు" అన్నది బ్రహ్మరాక్షసి. "మాయ, మంత్రం ఉపయోగించకూడదు. నా ఎత్తుకు దిగి వచ్చి, నాతో ఖడ్గయుద్ధం చెయ్యాలి" అని చెప్పాడు మణిదీపుడు.

కనురెప్పపాటులో అతడి ఎత్తుకు దిగివచ్చింది బ్రహ్మరాక్షసి. మంత్రబలంతో దాని చేతిలోకి ఓ ఖడ్గం వచ్చింది.

అతడి చేతిలో వున్నది కూడ దివ్యఖడ్గమే కనుక అది ధర్మయుద్ధమే.

యువరాణులంతా దూరంగా జరిగారు.

ఆ ఇద్దరి ఖడ్గాలు కలుసుకున్నాయి. పోరు మొదలయింది.

ఖంగు ఖంగుమని మోగుతున్న ఆ ఖడ్గాల ధ్వని ఆ భవనంలో ప్రకంపనలను రేపుతున్నది.

కత్తుల నుంచి మెరుపులు మెరుస్తున్నాయి.

రెండు సింహాలు తలపడుతున్నట్టే వున్నది. వారి పద ఘట్టనలతో ఆ భవనపు పునాదులు కదిలిపోతాయన్నట్టు వున్నదా పోరాటం. అప్పటికి రెండు గడియలుగా యుద్ధం జరుగుతున్నది. మణిదీపుడి ఖడ్గవిన్యాసం చూసి తిమ్మయ్య

ఆశ్చర్యపోయాడు. చంద్రలేఖ, మిగతా యువరాణులంతా కళ్లప్పగించి చూస్తున్నారు.

చివరికి బ్రహ్మరాక్షసి అలసిపోయింది. ధర్మయుద్ధం చెయ్యాలి కాబట్టి అది మాటకు కట్టుబడి మంత్రాన్ని ఆశ్రయించలేదు.

ఎందరో రాకుమారుల తలలను ఖండించిన ఆ బ్రహ్మరాక్షసి తలను ఒక్కవ్రేటుతో తెగ నరికాడు అతడు.

అక్కడికక్కడే కుప్పకూలి మరణించింది ఆ బ్రహ్మరాక్షసి. వెను వెంటనే అక్కడొక దేవకన్య ప్రత్యక్షమైంది.

“నాయనా! మణిదీపా... నాపేరు విద్యాధరి. నీ పుణ్యాన నాకు శాపవిమోచనమైనది. తపస్సు చేసుకుంటున్న ఓ ఋషీశ్వరుని ధ్యానాన్ని భగ్నం చేయడమే కాక ఆ యశస్వి పట్ల అవమానకరంగా ప్రవర్తించాను. ఆయన శపించగా ఇక్కడిలా బ్రహ్మరాక్షసిగా జీవిస్తున్నాను. చెలికత్తెలను వెంట పెట్టుకుని తిరిగే నేను, పూర్వ స్మృతి లేకపోయినా దేశదేశాల రాకుమార్తెలను తెచ్చి ఇక్కడ బంధించాను. అప్పుడప్పుడు వారిని చూసి మురిసిపోయేదాన్ని... నాకు శాపవిమోచనం కలిగించిన నీకు సర్వధా శుభం కలుగుతుంది నాయనా!” అంటూ అతణ్ణి దీవించింది.

వాళ్లంతా వారి వారి రాజ్యాలకు చేరడానికి వీలుగా మంత్రశక్తితో వారిముందు ఒక పుష్పక విమానాన్ని సృష్టించింది.

ఆ యువరాణులందరితో పాటు చంద్రలేఖ, మణిదీపుడు, తిమ్మయ్య ఎక్కిన ఆ పుష్పక విమానం మబ్బులను చీల్చుకుని ఆకాశయానం చేస్తూ వుండగా ఆ దృశ్యాన్ని ఆనందంగా చూస్తూ తన లోకానికి వెళ్లిపోయిందా దేవకన్య.

❖ ❖ ❖

చంద్రలేఖను కౌగిలించుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు శాంభవీదేవి, కీర్తిసేనుడు.

"మళ్లీ నిన్ను కళ్ల చూస్తామనుకోలేదమ్మా... ఆ పరమేశ్వరుడు కరుణించాడు" అన్నది శాంభవీదేవి.

"మన్నించండి మహారాణీ... ఆ మహేశ్వరుడి దయ వల్ల నా శిష్యుడి లాంటి మిత్రుడు సాహసం చేసి రక్షించాడు" అన్నాడు తిమ్మయ్య.

"నువ్వు చెప్పింది నిజమే తిమ్మయ్యా... మణిదీపుడికి మేము ఋణపడి వున్నాము. ప్రకటించిన విధంగా అర్ధరాజ్యాన్ని అతడికి ఇస్తాము" అన్నాడు కీర్తిసేనుడు.

అక్కడే వున్న మణిదీపుడు గంభీరంగా చూసి, "ప్రభూ! అర్ధరాజ్యాన్ని ఆశించి నేను యువరాణిని రక్షించలేదు. మీ కొలువులో నేనొక సామాన్య సైనికుణ్ణి. నా విద్యుక్త ధర్మాన్ని నేను నిర్వర్తించాను. మీ అర్ధరాజ్యం నేను స్వీకరించను" అంటూ తల వంచి అభివాదం చేశాడు.

చంద్రలేఖ ఏదో మాట్లాడబోయి ఏమీ చెప్పలేక మౌనంగా తల దించుకున్నది.

ఆ ఇద్దరికీ ఒకరి పట్ల ఒకరికి ప్రేమభావన మొలకెత్తిందని తెలిసిన తిమ్మయ్య కూడ ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఆ రాజమందిరం నుంచి బయటికి వెళ్లబోతూ తల తిప్పి చూశాడు మణిదీపుడు. "మహారాజా... యువరాణిని కొరివిదెయ్యాలు ఎత్తుకుపోయే రోజు, ఆమె నాతో రహస్యంగా ఏదో చెప్పాలని తిమ్మయ్యతో కబురు పంపించారు. అదేమిటో చెబితే విని వెళ్లిపోతాను. ఒకవిధంగా మీ ఆజ్ఞను ధిక్కరించి రాకుమారిని కలవాలని ప్రయత్నం చేశాను. ఆవిధంగా నేను శిక్షార్హుణ్ణి!"

చంద్రలేఖ వైపు ఓరగా చూసి కనుసైగలతో మాట్లాడాడు కీర్తిసేనుడు.

ఆమె నునుసిగ్గుతో సైగలతోనే తండ్రికి జవాబు చెప్పి, తల దించుకున్నది.

కీర్తిసేనుడు గంభీరంగా తల వూపి, "మణిదీపా.. నేరం నువ్వే ఒప్పుకున్నావు. కనుక, నీకు శిక్ష తప్పదు. కనుక, మీ ఇద్దరికీ ముడిపెట్టి వివాహం చెయ్యడమే మీ ఇరువురికీ మేము విధించే పెద్దశిక్ష.." అన్నాడు.

మహారాజు మాటలు విని తిమ్మయ్య ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు.

"మరో శుభవార్త ఏమిటంటే... మణిదీపుడికి రాజ్య పట్టాభిషేకం చేసిన రోజున తిమ్మయ్యను కోశాధికారిగా ప్రకటించడం జరుగుతుంది" అని కీర్తిసేనుడు చెప్పగానే తిమ్మయ్య తిరిగి సంతోషం పట్టలేక, నోటి వెంట మాట రాక తడబడిపోయాడు.

అది చూసి వాళ్లందరూ పగలబడి నవ్వుకున్నారు.

తిమ్మయ్య రెండు గంతులు వేసి "కీర్తిసేన మహారాజుల వారికీ జై... మరాళదేశానికీ జై..." అంటూ మరాళదేశపు పతాకం వైపు చూసి తల వంచి అభివాదం చేశాడు.

**సమాప్తం**

# అడపా చిరంజీవి

## రచనలు


1. కపాలదుర్గం
2. వజ్రాలదీవి
3. కోటలో పాగా
4. రవ్వలో మేడ
5. మాట్లాడే కోతి
మాయాతివాసి
6. దెయ్యాలదిబ్బ
వజ్రాలహారం
7. పులి మీద పుట్ర
8. కత్తులబోను
9. మనీ అండ్ బుల్లెట్స్
10. గాలిబంగ్లా
11. ట్రంప్‌కార్డ్
12. మృత్యుసింహాసనం
13. హవేలి
14. మృతసంజీవిని
15. యమడేంజర్
16. ఆఖరి క్షణం
17. మరణ ముహూర్తం
18. ప్రేమపోరాటం
19. నిశాచరుడు
20. రాబందుల రాజ్యం
21. సహస్రాక్షుడు
22. మరణ సరిహద్దు
23. ప్రేమే నేరమౌనా?
24. క్షణమొక యుగం
25. చీకటి కళ్లు
26. యమధర్మం
27. కింజోరి
28. యమపాశం
29. ది జంగిల్
30. ప్రవరాఖ్యుడు
31. మేరానామ్ జోకర్
32. వనరాణితో రేరాజు
33. ఈ కథకు ముగింపులేదు
34. దెయ్యాలతో దెబ్బలాట
35. ప్రేమాలయం



"నీవన్నది నిజం... మా యువరాణి ముందు దేవకాంతలు కూడ తమ అందాన్ని పరీక్షించుకుని ముఖాలు చిన్నబుచ్చుకుంటారు. మా అందాల బరిణెను చూస్తే మన్మథుడు, నలకూబరుడులాంటి దివ్య పురుషులు వారి లోకాన్ని విడిచి వస్తారు...." అంటూ రాజకుమారి గురించి గొప్పగా వర్ణించి చెప్పాడు తిమ్మయ్య.

"అలాంటప్పుడు మాలాంటి వీరులకు పోటీ పెట్టి, భవంతిలోకి వెళ్ళగలిగిన వారికి యువరాణినిచ్చి పెళ్ళి చేయవచ్చు కదా!" అని అతని ముఖంలోకి చూశాడు.

"పోటీ పెట్టి పెళ్ళి చేయడానికి ఇది స్వయంవర ప్రకటనకాదు! యువరాణి రక్షణార్థం ఏర్పాటు చేసిన మందిరం... ఇంతకీ తమరెవరు వీరకిశోరా?" అని ప్రశ్నించాడు కాస్త వ్యంగ్యంగా.

"మీ పొరుగునున్న నికుంభ రాజ్యం మాది. యువరాజు సూర్యవర్మని. మీ రాజ్యంలో పరిస్థితుల గురించి మా వేగులు చెప్పగా విని, ఈ వింత ఏమిటో చూద్దామని వచ్చాను..."

ఆ రాజ్యంలో ఆ పరిస్థితులేమిటి?

ఆ వింత ఏమిటి?

పాఠకులను వాయుమనోవేగాలతో పరుగులు తీయించే

మణిదీపుడి సాహసయాత్ర

# కత్తుల బోను

అడపా చిరంజీవి జానపద నవల!

శ్రీకృష్ణదేవరాయ పబ్లికేషన్స్,

హైద్రాబాద్.